జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT


Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 352 | హైదరాబాద్, అక్టోబరు 12 మంగళవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

## ఈ సారి కూడా ఆరు పేపర్లతో..
# పదో తరగతి పరీక్షలు



హైదరాబాద్,అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:పదో తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ పై క్లారిటీ ఇచ్చింది ప్రభుత్వం. ఈసారి కూడా బోర్డ్ ఎగ్జామ్స్ లో ఆరు పేపర్లే ఉంటాయని తెలిపింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. కరోనాతో గత రెండేళ్లుగా పదోతరగతి పరీక్సలు రద్దుచేసింది ప్రభుత్వం. ఈసారి పరీక్షలపై క్లారిటీ ఇవ్వలేదు. 11 పరీక్షలుంటాయా.. 6 పరీక్షలకే కుదిస్తుందా అనే అయోమయం టీచర్లు, విద్యార్థుల్లో ఉంది. క్లాసులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పరీక్షలపై క్లారిటీ ఇవ్వకపోవటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు ఆరు పేపర్లే ఉంటాయని ఉత్తర్వులు జారీచేసింది ప్రభుత్వం. అలాగే హిందీతోపాటు.. ఉర్దూను ద్వితీయ భాషగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

# చినజీయర్ స్వామిని కలిసిన కేసీఆర్

హైదరాబాద్,అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని చినజీయర్ స్వామి ఆశ్రమానికి సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. ముచ్చింతల్ ఆశ్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను శాలువాలతో చినజీయర్ స్వామి సత్కరించి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జీవ ప్రాంగణంలోని కుటీరంలో చినజీయర్ స్వామితో సమావేశమైన సీఎం కేసీఆర్..



భగవత్ రామానుజచార్య ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రామానుజ సహస్రాబ్ది ఉత్సవం సందర్భంగా కుటీర ప్రాంగణంలో సీఎం కేసీఆర్ మొక్కలు నాటారు. సమతామూర్తి విగ్రహావిష్కరణకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, ఆయా రాష్ట్రాల సీఎంలను చినజీయర్ స్వామి ఆహ్వానించిన విషయం తెలిసిందే. రామానుజ సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న సమతామూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

## రాజౌరీ సెక్టార్ ఎదురు కాల్పుల్లో..
# ఐదుగురు వీర జవాన్లు మృతి



శ్రీనగర్,అక్టోబరు 11 ప్రజాపాలన ప్రతినిధి: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో సోమవారం ఉదయం ఉగ్రవాదులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు జవాన్లు వీరమరణం పొందారు. వీరిలో ఒక జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీఓ) కూడా ఉన్నారు. పీర్ పంజల్ రేంజ్‌లో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తిప్పికొట్టే సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో సైన్యం అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిగింది. పూజ్ జిల్లా సురన్‌కొటేలో ఉగ్రవాదులు తలదాచుకున్నారనే నిఘావర్గాల సమాచారంతో భారత బలగాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ క్రమంలోనే ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో సైన్యం ఎదురుకాల్పులకు దిగింది. ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదాలెవరైనా మరణించారా అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

# ముగ్గురు విజేతలు వీరే..



స్వీడన్, అక్టోబరు 11 ప్రజాపాలన ప్రతినిధి: ఎకనమిక్ సైన్స్‌లో ఈ ఏడాది ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. లేబర్ ఎకనమిక్స్‌పై అనుభావిక రచనలు చేసినందుకు గాను సగం బహుమతిని డేవిడ్ కార్డ్‌కు ప్రకటించగా, సాధారణ సంబంధాలపై విశ్లేషణపూర్వక మెథడోలాజికల్ రచనలకు గాను జోషువా డి.అంగ్రిస్ట్, గైడో డబ్ల్యూ ఇంబెన్స్‌కు సంయుక్తంగా మిగతా సగం బహుమతిని ప్రకటించింది. సామాజిక శాస్త్రంలోని చాలా వరకు పెద్ద సమస్యలు కారణం, ప్రభావంతో వ్యవహరిస్తాయని స్వీడిష్ అకాడమీ పేర్కొంది.వేతనం, ఉపాధి స్థాయులపై ఇమ్మిగ్రేషన్ ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? సుదీర్ఘ విద్య ఒకరి భవిష్యత్తు ఆదాయంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? లాంటి ప్రశ్నలకు సహజ ప్రయోగాల ద్వారా సమాధానం ఇవ్వడం సాధ్యమని బహుమతి గ్రహీతలు నిరూపించారని స్వీడిష్ అకాడమీ పేర్కొంది. ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతిని స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రదానం చేస్తుంది. కాగా, ఎకనమిక్స్‌లో గతేడాది పాల్ ఆర్.మిల్‌గ్రామ్, రాబర్ట్ బి.విల్సన్‌లు సంయుక్తంగా అందుకున్నారు.

# దేశంలో బొగ్గు సంక్షోభం..

## కమ్ముకొస్తున్న కారు చీకట్లు.. అమిత్ షాతో కేంద్ర మంత్రుల కీలక భేటీ!



న్యూఢిల్లీ, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:విద్యుత్ సంక్షోభం ఏ ఒక్క రాష్ట్రం సమస్య కాదు.. దేశవ్యాప్తంగా కారు చీకట్లు తరుముకొస్తున్నాయి. ఈ సంక్షోభాన్ని ఎలా అధిగమించాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్ చేసింది. హెూంమంత్రి అమిత్‌షాతో.. మరో ఇద్దరు మంత్రులు ఆర్కే సింగ్, ప్రహ్లాద్ జోషి సమావేశం అయ్యారు. తక్షణం చేపట్టాల్సిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ.. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా కొనసాగుతోందని తెలిపారు ఆర్‌కేసింగ్. విపక్షాలు ఈవిషయంపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. డిస్కంలలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తునట్టు తెలిపారు. ఇదిలావుంటే, దేశంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడే అవకాశం లేదని ఓవైపు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రాష్ట్రాలు మాత్రం ఆందోళన చెందుతూనే ఉన్నాయి. ముఖ్యంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయని ప్రకటిస్తున్నాయి. తాజాగా వీటిపై స్పందించిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. ప్రస్తుతం చాలా క్లిష్టపరిస్థితులు ఉన్నాయని మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పరిస్థితులను చక్కబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తం బొగ్గు నిల్వలు భారీ తగ్గిపోయాయి. దీంతో విద్యుత్ (మిగతా 2లో..)




## సూర్యాపేట జిల్లాలో గంజాయి పట్టివేత

సూర్యాపేట,అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: జిల్లాలోని మద్దిరాల మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్ వద్ద మద్దిరాల పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లు, నిషలాళ్‌లు అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హెటిరో డ్రగ్స్ ఐటీ సోదాల్లో భారీగా నగదు పట్టివేత



హైదరాబాద్,అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: హెటిరో సంస్థలో ఐటీ అధికారులు జరిపిన సోదాల్లో భారీగా నగదు పట్టుబడింది. రూ. 550 కోట్ల బ్లాక్ మనీని గుర్తించారు. రూ. 142 కోట్ల నగదు సీజ్ చేశారు. 6 రాష్ట్రాల్లో హెటిరో సంస్థల్లో 60 చోట్ల 4 రోజులపాటు ఐటీ దాడులు జరిగాయి. వందల కొద్దీ అట్టపెట్టెల్లో నగదును దాచిపెట్టడాన్ని గుర్తించారు. బీరువాల నిండా రూ. 500 నోట్ల కట్టలే ఉన్నాయి. నిండా నోట్ల కట్టలున్న ఇనుప బీరువాలను అధికారులు సీజ్ చేశారు. చిన్న చిన్న అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొని డబ్బు దాచినట్టు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా మెడిసిన్ నిల్వ పేరుతో అట్టపెట్టెల్లో రూ. 142 కోట్లు దాచారని అధికారులు వెల్లడించారు. ఇనుప అల్మారాల్లో డబ్బును కుక్కిపెట్టారని తెలిపారు. ఒక్కో అల్మారాలో రూ. 5 కోట్ల నగదు దాచారని తెలిపారు. డబ్బు లెక్క పెట్టేందుకే రెండు రోజుల సమయం పట్టింది. పెద్ద సంఖ్యలో లాకర్లు గుర్తించిన ఐటీ అధికారులు మూడ్రోజులుగా లాకర్స్‌ను తెరిచి పరిశీలిస్తున్నారు.

## నల్లగొండలో నేడు షర్మిల దీక్ష



నల్లగొండ, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో దీక్ష చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు ప్రత్యేక బస్సులో ఎంజీ యూనివర్సిటీకి చేరుకుని అక్కడి సమస్యలపై విద్యార్థులతో చర్చించనున్నారు. 10.40కు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌కు చేరుకుని అమరవీరుల స్థూపానికి, శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్యలు, నిరుద్యోగంతో ఆత్మహత్యలు చేసుకున్న యువకుల కుటుంబాలను పరామర్శించడానికి షర్మిల జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటికే ఆమె యాదాద్రిభువనగిరి జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి, నల్లగొండ జిల్లాలోని చండూరు మండల కేంద్రంలో నిరుద్యోగ సమస్యతో ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలను పరామర్శించారు.

## ఈటల రాజేందర్‌కు ఊరట



హుజూరాబాద్, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: హుజూరాబాద్ ఉప ఎన్నిక నామినేషన్లలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఊరట లభించింది. రాజేందర్ పేరుతో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలనలో సరైన పత్రాలు లేకపోవడంతో ఇప్పలపల్లి రాజేందర్, ఇసంపల్లి రాజేందర్, ఇబ్బడి రాజేందర్ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో ఈటల రాజేందర్‌కు ఊరట లభించినట్లయ్యింది. హుజూరాబాద్‌లో ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు గాను 61 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అందులో 19మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. 61మంది మంది అభ్యర్థులు 92 నామినేషన్ల సెట్లు దాఖలు చేశారు. పరిశీలనలో నిబంధనల ప్రకారం లేని 19 మంది అభ్యర్థుల 23 సెట్ల నామినేషన్లను తిరస్కరించారు. ప్రస్తుతం బరిలో ఉన్న 42 మంది అభ్యర్థులు ఉన్నారని, ఈ నెల 13 వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంది.

# దేశంలో బొగ్గు సంక్షోభం..

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇదే విషయంపై ఇప్పటికే పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. పరిస్థితులను మెరుగుపరచడానికి మేమంతా కలిసి ప్రయత్నాలు చేస్తున్నాం' అని ఢీల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. అయితే, చాలా థర్మల్ విద్యుత్ కేంద్రాలు బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నాయని.. ప్రస్తుతమున్న నిల్వలు కేవలం రెండు మూడు రోజులకే సరిపోతాయని ఢీల్లీ విద్యుత్‌శాఖ మంత్రి సత్యేందర్ జైన్ పేర్కొన్నారు. ఇదివరకు దాదాపు 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేవారమని.. కానీ, ప్రస్తుతం ఆ ఉత్పత్తి నగానికి తగ్గిపోయిందన్నారు. అంతకుముందు విద్యుత్ సంక్షోభంపై జోక్యం చేసుకోవాలంటూ ప్రధానమంత్రి మోడీకి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. రాజధానిలో విద్యుత్తు సంక్షోభం తలెత్తకుండా వెంటనే బొగ్గు, గ్యాస్ సరఫరా చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. దేశంలో చాలా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడుతున్న దృష్ట్యా డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో కరెంటు కోతలకు ఆయా రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. మహారాష్ట్రలోనే దాదాపు 13 విద్యుత్ కేంద్రాలు బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ పరిస్థితులను త్వరగా చక్కబెట్టకపోతే మరికొన్ని రోజుల్లోనే నిత్యం 6 నుంచి 8గంటల విద్యుత్ కోత విధించక తప్పదని మహారాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రానికి సరిపడా బొగ్గును కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. అటు కేరళ కూడా విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష జరుపనున్నారు. అధికారులతో చర్చించిన అనంతరం విద్యుత్ కోతలపై ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం. ఇదిలావుంటే, విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రానికి అవసరమైన బొగ్గును కేంద్రం సరఫరా చేయట్లేదంటూ పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ ఈమధ్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న కొద్దిపాటి బొగ్గు నిల్వలూ వేగంగా అడుగంటుతున్నాయని, రానున్న రోజుల్లో థర్మల్ విద్యుత్తు కేంద్రాలు మూతపడడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అక్కడ పలు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా తగ్గడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గినట్లు సమాచారం. దీంతో పంజాబ్‌లో నిత్యం 3 నుంచి 4గంటల పాటు కరెంటు కోత విధిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడనున్నట్లు వస్తోన్న వార్తలను ఖండిస్తోంది. ఇలాంటివన్నీ అనవసర భయాందోళనలను సృష్టిస్తున్నాయని.. దేశంలో అవసరాలకు సరిపడా విద్యుత్ వనరులు అందుబాటులో ఉన్నాయని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ స్పష్టం చేశారు. కేవలం గెయిల్ (%+ూ×ూ%), డిస్కం సంస్థల మధ్య సమాచారలోపం వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు. దేశంలో విద్యుత్ సంక్షోభానికి కారణమయ్యే సరఫరా, వినియోగం మధ్య ఎలాంటి అగాధం లేదని ఆర్‌కే సింగ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ దేశంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరా పెంచి సంక్షోభాన్ని తప్పిస్తామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర హెూంమంత్రి అమిత్ షా నేతృత్వంలో కేంద్ర మంత్రులు సమావేశమై సోమవారం చర్చించారు. విద్యుత్ ఉత్పత్తిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండలం, ప్రజా పాలన ప్రతినిధి అక్టోబర్ 11 :కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి సుజాతనగర్ మండలం లోని పాత అంజనాపురం గ్రామం లో కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పోల బోయిన గోపాల్ వయస్సు 24 సంవత్సరాలు అనే వ్యక్తి నీటిని వేడి చేసేందుకు హీటర్ అమర్చ గా ఆ హీటర్ ద్వారా కరెంట్ షాక్ కొట్టడం తో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినాడు వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మరణించే ఉండటం గమనించారు విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ సిపిఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ సర్పంచి రవి తదితరులు పాల్గొన్నారు

# పంజాబ్ లో బొగ్గుల కొరత

ఛండీఘడ్, అక్టోబరు 11 ప్రజాపాలన ప్రతినిధి: చవ్యాప్తంగా బొగ్గు కొరతతో విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. బొగ్గు కొరత కారణంగా పంజాబ్‌లో విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. బొగ్గు కొరతతో మూడు థర్మల్ విద్యుత్ ప్లాంట్లను మూసివేయాల్సి వచ్చింది. తమ రాష్ట్రానికి బొగ్గు సరఫరా పెంచాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ కేంద్రాన్ని అభ్యర్థించారు. రాష్ట్రంలో 5,620 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న థర్మల్ విద్యుత్ ప్లాంట్లు ఉన్నా ప్రస్తుతం 2,800 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. బొగ్గు కొరత ఫలితంగా పంజాబ్‌లోని లెహ్రా మొహబ్బత్, రోపర్ (రూప్‌నగర్), రాజ్‌పురా, తల్వాండి సాబో, గోయింద్వాల్ సాహిబ్‌తో సహా థర్మల్ పవర్ ప్లాంట్లు మరో నాలుగు రోజులు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేయగలవని చెప్పారు. పంజాబ్?లో ఇప్పటికే ఐదు థర్మల్ పవర్ ప్లాంట్‌లు మూసివేశారు. బొగ్గు కొరత కారణంగా రోపర్‌లో రెండు, తల్వంతి సాబోలో రెండు, లెహ్రా మొహబ్బత్‌లో ఒకటి మూసివేశారు. ఉత్పత్తి తగ్గటంతో పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రైవేట్ సంస్థలు, పొరుగు రాష్ట్రాల నుండి విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వానికి చాలా డబ్బు ఖర్చు అవుతుందని పీఎస్‌పీసీఎల్ ఛైర్మన్ ఎ వేణు ప్రసాద్ తెలిపారు. బొగ్గు కొరత కారణంగా పీఎస్‌పీసీఎల్ మూడు నుండి ఆరు గంటల వరకు విద్యుత్ కోతలను విధిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, శిరోమణి అకాలీదళ్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 300 నుంచి 400 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ప్రజలకు వాగ్దానం చేస్తున్నాయి. చరణ్‌జిత్ సింగ్ చాన్నీ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వం సొంత నేతల నుండి విమర్శలను ఎదుర్కొంటోంది. 30 రోజుల వరకు బొగ్గు నిల్వలు ఉంచకుండా దేశీయ వినియోగదారులను శిక్షిస్తున్నారని.. దీనికి ప్రభుత్వం పశ్చాత్తాపం పడలన్నారు. సోలార్ పీపీఎలు, రూఫ్-టాప్ సోలార్‌పై దూకుడుగా పని చేయాల్సిన సమయం వచ్చిందని" అని కాంగ్రెస్ పార్టీ నేత చెందిన నవజ్యోత్ సింగ్ సిద్ధు ట్విట్టర్‌లో అన్నారు. ప్రస్తుత విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించడానికి రాష్ట్రాని బొగ్గు సరఫరాను వెంటనే పెంచాలని పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ కేంద్రాన్ని కోరారు. పంజాబ్‌లోని బొగ్గు నిల్వలు కొన్ని రోజుల్లో అయిపోతాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి చన్నీ.. థర్మల్ ప్లాంట్లలో తగినంత బొగ్గు లేని కారణంగా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. నగరాలు, గ్రామాల్లో గృహ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, వ్యవసాయ రంగానికి కోతలు విధించాల్సి వస్తుందన్నారు.

# పేదల కోసమే... కేంద్ర సర్కార్




న్యూఢిల్లీ, అక్టోబరు 11 ప్రజాపాలన ప్రతినిధి: 2014 నుంచి ఇప్పటి వరకు భారత ప్రధాన మంత్రిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటూ పాలన సాగిస్తున్నారు పీఎం నరేంద్ర మోదీ. తన విభిన్న శైలితో యావత్ దేశ ప్రజానికాన్నే కాక.. ప్రపంచ దేశాలను సైతం తన వైపునకు తిప్పుకుంటున్నారు. అయితే, ప్రధాని మోదీ నియంతృత్వ ధోరణి కలిగి ఉంటారని విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుంటాయి. కేంద్ర మంత్రులను, అధికార యంత్రాంగాన్ని మొత్తం తన గ్రిప్‌లో పెట్టుకుని.. ఏకపక్షంగా వ్యవహరిస్తారని అంటుంటారు. అయితే, ఇదే అంశంపై తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ప్రశ్న లేవనెత్తారు ఓ జాతీయ మీడియా ప్రతినిధి. దీనికి ఆయన చాలా ఆసక్తికరమైన రిప్లై ఇచ్చారు. అంతేకాదు.. ప్రధాని మోదీకి సంబంధించి ఇంట్రస్టింగ్ విషయాలను పంచుకున్నారుప్రధాని మోదీ నిరంకుశ పద్ధతిలో నిర్ణయం తీసుకుంటారా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. “మోడీ లాంటి శ్రోత ను నేనెప్పుడూ చూడలేదు. ఏ సమావేశంలో అయినా ఆయన అతి తక్కువ మాట్లాడుతారు. ప్రతీ ఒక్కరు మాట్లాడేది ఓపిగా వింటారు. విషయ పరిజ్ఞానం ఆధారంగా ప్రతి వ్యక్తి సూచనలకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తారు.” అని తాజాగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ..గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, భారత ప్రధానిగా 7 ఏళ్లు, మొత్తం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా జాతీయ మీడియాతో ఇంటర్వ్యూలో మాట్లాడారు. “ప్రధాని మోదీపై మోపని నిందంటూ లేదు. కానీ, ఆయన అన్నింటినీ అధిగమించారు. ప్రతిపక్షాలే ప్రధాని మోదీని మరింత బలవంతుడిని చేస్తాయని ఆయన భావన. ప్రజల పట్ల ఆయనకు అపార విశ్వాసం ఉంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా దేశం కోసమే అని ప్రజలకు బాగా తెలుసు. ఈ నిర్ణయాల వల్లే దేశానికే ఉపయోగం తప్ప.. ఆయనకు ఎలాంటి ప్రయోజనం లేదు. అందుకే కొన్ని విషయాల్లో పొరపాట్లు జరిగినా..ప్రజలు తమను క్షమించారు.” అని అమిత్ షా తెలిపారు. భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఏ భారతీయ ప్రధాన మంత్రి కూడా చెప్పలేదు. ఈ రోజు మన ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉంది. త్వరలోనే 5వ స్థానానికి చేరుకుంటుంది. భారత్ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందనే నమ్మకం నాకు ఉంది.” అని అమిత్ షా పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే.. “ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలో ఆయన ప్రారంభ రోజులు. రెండవది, గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన కాలం. మూడవది, జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడం. మోడీ.. తన అకుంఠిత శ్రమ, వ్యూహాత్మక విధానాలతో, పకడ్బందీ కార్యాచరణ అమలు చేయడం ద్వారా గుజరాత్‌లో బీజేపీని బలోపేతం చేశారు. ఇక భారత ప్రధానిగా నరేంద్ర మోదీ.. గత ఏడు సంవత్సరాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, సంస్కరణలు తీసుకువచ్చారని అమిత్ షా పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణలకు సంబంధించి ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇదే సమయంలో రైతు ఉద్యమంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక కామెంట్స్ చేశారు. రైతుల నిరసనలు, ఆందోళనలు అర్థం లేనివి అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు చట్టాలు రైతులకు మేలు చేసేవే తప్ప.. హానీ తలపెట్టవని స్పష్టం చేశారు. వామపక్ష భావజాలం పేదల సంక్షేమం కోసం కాదని, అధికారాన్ని చేజిక్కించుకోవడానికి.. పేదల ఆగ్రహాన్ని క్యాపిటలైజ్ చేయడానికి ఇది ఒక మార్గం అని విమర్శించారు. వామపక్ష పాలిత రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసునని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# ప్రియాంకతో కమలానికి దారి..!



లక్నో, అక్టోబరు 11, :ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలు మరో ఆరు నెలల్లో జరుగుతున్నాయి. ఈ పోరు హోరాహోరీ సాగుతుంది. బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని తీవ్రంగా శ్రమిస్తుంది. అందుకు విపక్షాలు కూడా పరోక్షంగా సహకరించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్ లో కాంగ్రెస్ బలపడితే అది బీజేపీకే లాభమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ ఎన్ని ఓట్లు చీలిస్తే అంత పోరులో ముందున్న సమాజ్ వాదీ పార్టీకే నష్టమని అంటున్నారు. ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పోటీ చేసినా పెద్దగా ఇబ్బంది ఉండదు. యూపీలో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఇప్పటి వరకూ సమాజ్ వాదీ పార్టీ వైపే ఉన్నారు. వారికి ఒవైసీ పార్టీ మీద పెద్దగా భ్రమల్లేవు. ఒకటి రెండు స్థానాల్లో తప్ప ఎంఐఎం రాష్ట్రమంతటా ఉన్న ముస్లిం ఓటర్లను ప్రభావం చేసే పరిస్థితి లేదు. హైదరాబాద్ పార్టీని యూపీ ముస్లిం సమాజం పెద్దగా సీరియస్ గా తీసుకోదు. ఒవైసీ సభల్లో చప్పట్ల వరకే పరిమితమవుతాయి. ప్రియాంక గాంధీ అలా కాదు. ఇటీవల ఆమె ఉత్తర్ ప్రదేశ్ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మిత్ర పక్షాలు ఏవీ తమను కలుపుకు వెళ్లమని చెప్పడంతో సొంతంగా ఎదిగే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీకి పూర్వ వైభవం తేవాలనుకుంటున్నారు. అందుకే పూర్తిగా ఇన్ వాల్వ్ అవుతున్నారు. లఖింపూర్ వెళుతుండగా ప్రియాంక గాంధీ అరెస్ట్ తో కాంగ్రెస్ పార్టీకి మంచి మైలేజీ వచ్చిందంటున్నారు. నానమ్మ పోలికలు ఉండటం కూడా ఆమెను జనం వద్దకు సులువుగా చేరుస్తుంది. అయితే ప్రియాంక ఎంత పార్టీని బలోపేతం చేస్తే అంత సమాజ్ వాదీ పార్టీకి నష్టమన్న అభిప్రాయం ఎక్కువగా విన్పిస్తుంది. బీజేపీ కూడా అదే కోరుకుంటుంది. అందుకే అవసరం లేకపోయినా లఖింపూర్ ఘటనలో ప్రియాంక గాంధీని హౌస్ అరెస్ట్ చేసి సింపతీని పొందేలా ప్లాన్ చేసిందంటున్నారు. ముస్లింలు, దళిత ఓటర్లను ప్రియాంక గాంధీ ఆకట్టుకుంటే చాలు ఉత్తర్ ప్రదేశ్ లో బీజేపీ విజయం సాధించినట్లే. మరి రానున్న రోజుల్లో రాజకీయాలు ఎలా మారతాయో చూడాలి.

# ఫీజు వసూళ్లపై మరో కమిటీ



హైద్రాబాద్, అక్టోబరు 11,:రూల్స్ కు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ మరోసారి ఎంక్వైరీ మొదలుపెట్టింది. నలుగురు జాయింట్ డైరెక్టర్ల (జేడీ)తో కూడిన కమిటీ ఈ పని ప్రారంభించింది. రాష్ట్రంలో కరోనా నేపథ్యంలో ప్రైవేటు స్కూల్స్ కేవలం ట్యూషన్‌ఫీజులు మాత్రమే పేరెంట్స్ నుంచి తీసుకోవాలని, గతేడాది ఉన్న ఫీజులనే ఈసారి తీసుకోవాలని, అది కూడా ప్రతినెల వసూలు చేయాలని ప్రభుత్వం జీవో రిలీజ్ చేసింది. అయితే ఈ జీవోను చాలా స్కూళ్లు పట్టించుకోలేదు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచడంతో పాటు ఒకేసారి మొత్తం ఫీజులను పేరెంట్స్‌నుంచి వసూలు చేశాయి. దీనిపై స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులకు పేరెంట్స్ ఫిర్యాదు చేశారు. హైకోర్టు దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకుపోయారు. ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు రెండు నెలల కిందట సుమారు 50 స్కూళ్లకు నోటీసులు ఇచ్చారు. ఇద్దరు జేడీ స్థాయి అధికారులతో విచారణ చేయించారు. అయితే ఈ ఎంక్వైరీలో స్పష్టత రాలేదు. దీంతో తాజాగా ఐదు రోజుల కిందట గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 11 సీబీఎస్‌ఈ సిలబస్ స్కూళ్లలో మరోసారి విచారణ చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు నిర్ణయించారు. దీనికోసం జాయింట్ డైరెక్టర్లు సోమిరెడ్డి, రాజేశ్, రమేశ్, సత్యనారాయణరెడ్డితో కమిటీని వేశారు. ఈనెల 7 లోగా రిపోర్టు ఇవ్వాలని డైరెక్టర్ శ్రీదేవసేన ఆదేశాలు జారీ చేశారు. అయితే సమగ్ర విచారణకు మరో పదిరోజుల సమయం కావాలని జేడీలు కోరారు. ఈ మేరకు ఈనెల 20 లోపు రిపోర్టును స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు కమిటీ అందించనుంది. ఇప్పటికే పలు స్కూళ్లకు సంబంధించిన రికార్డులను డీఈఓలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని జేడీలు పరిశీలిస్తున్నారు. అయితే రాష్ట్రంలోని స్టేట్‌సిలబస్ స్కూళ్లలో ఏ ఒక్క స్కూల్ కూడా రూల్స్ ఉల్లంఘించలేదని అధికారులు చెప్తుండటం గమనార్హం. మౌంట్ లిటేరా జీ స్కూల్, మెరిడియన్ స్కూల్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, గీతాంజలి పబ్లిక్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, నారాయణ హైస్కూల్ డీడీ కాలనీ, కల్పస్కూల్, సెయింట్ ఆండ్రూస్‌సికింద్రాబాద్, సెయింట్ ఆండ్రూస్‌మేడ్చల్, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌హిమాయత్ నగర్, నీరజ్ పబ్లిక్ స్కూల్‌అమీర్ పేట.

# సెల్ ఫోన్లతో బ్యాంక్ ట్రాన్సాక్షన్స్... జర భద్రం...

నిజామాబాద్, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:సెల్ ఫోన్ సాయంలో విద్యుత్తు తదితర బిల్లులు చెల్లిస్తున్నా, ఏవైనా సరకులు కొనుగోలు చేస్తున్నారా? ఇతర పనులకూ నగదు లావాదేవీలు నిర్వహిస్తున్నారా?... ఇకపై మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ నేరస్థులు కొత్త పద్ధతుల్లో నేరాలకు పాల్పడుతున్నారు... నగదు భద్రంగా ఉండాలంటే బాధితులు వేగంగా స్పందించాలని సైబర్‌క్రైం పోలీస్ అధికారులు అంటున్నారు. నగదు పోయిన వెంటనే బాధితులు కొన్ని చర్యలు తీసుకుంటే లావాదేవీలను ఆపేందుకు వీలుందని సూచిస్తున్నారు. ఓటీపీ నంబర్లు చెప్పడం, ఇతర వివరాలను సైబర్ నేరస్థులతో పంచుకోవడం, కొన్ని సందర్భాల్లో ఈ-మెయిల్‌కు వచ్చిన సమాచారాన్ని నిజమైనదిగా భావించి త్రీడీ పిన్ నంబరును నేరగాళ్లకు ఇవ్వడం వంటివి చేయవద్దంటున్నారు. చరవాణితో డబ్బు పంపుతున్నప్పుడు, ఈ-వ్యాలెట్ ఖాతాలను నిర్వహిస్తున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటూ బాధితులకు సూచిస్తున్నారు. కొత్తగా డెబిట్ కార్డులను వాడుతున్నప్పుడు ఈ అంశాలను గుర్తుంచుకోవాలని వివరిస్తున్నారు. మీకు తెలియకుండానే ఫోన్ సైబర్ నేరస్థులు హ్యాకింగ్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు... ఏటీఎం నంబర్లు.. పాస్ వర్డ్లు తీసుకుంటున్నారు. ఒకసారి మీరు ఇంటర్నెట్ ఆధారంగా ఏదైనా వస్తువు కొంటే చాలు... వెంటనే మీ వ్యక్తిగత అంశాలన్నీ సైబర్ నేరస్థులకు తెలిసిపోతున్నాయి. అక్కడితో వారు ఆగడం లేదు... మీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు, పరిచయస్థులతో మీరు మాట్లాడే మాటలూ వింటున్నారు... అందుకే ప్రతి లావాదేవీ పూర్తి చేసిన వెంటనే ఫోన్ వ్యవస్థను మార్చుకోవాలని సైబర్ నేరాల అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల డెబిట్ కార్డులను విదేశీ సైబర్ నేరగాళ్లు హ్యాకింగ్ చేస్తుండగా... తాజాగా బ్యాంకు ఖాతాదారుల సెల్‌ఫోన్లనూ వదిలిపెట్టడం లేదు. చరవాణుల్లోని సాంకేతిక పరిజ్ఞానంతోనే ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుందని పోలీస్ అధికారులు వివరిస్తున్నారు. మా ప్రమేయం లేకుండానే పేయూ, పేటీఎం, ఛాయిస్ యు, పే ఫర్ ఇండియా, ఎస్‌బీఐ బడ్డీ వంటి ఈ-వ్యాలెట్‌లోకి ఆగంతుకులు నగదు మళ్లిస్తున్నారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇంటర్నెట్ సాయంతో ఒక్కసారి డెబిట్‌కార్డును చరవాణి ద్వారా వాడితే చాలు... సైబర్ నేరస్థులు పసిగట్టి ఆ చరవాణిని హ్యాక్ చేసి వివరాలను తీసుకుంటున్నారు.

## 108, 104 సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ



మంచిర్యాల బ్యూరో, అక్టోబర్11, ప్రజాపాలన : కరోన సమయంలో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించడంలో కీలక భూమిక పోషించిన 108, 104, ప్రభుత్వ అంబులెన్స్ ఉద్యోగులకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతులమీదుగా మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాస గృహంలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు150 మంది ఉద్యోగుల కు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మాట్లాడుతూ అర్హులైన మిగతా ఉద్యోగుల జాబితా ప్రకారం నూతన వస్త్రాలు అందించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కరోణ విస్తృతంగా ఉన్న సమయంలో రోగులను ఆస్పత్రికి చేర్చడంలో, వైద్య సేవలు అందించడంలో 108 , 104, అంబులెన్స్ సిబ్బంది ఎంతో సేవ చేశారని కొనియాడారు. సమాజానికి సేవ చేసిన ఈ మూడు విభాగాల సిబ్బందిని సత్కరించాలనే సంకల్పంతో నూతన వస్త్రాలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ప్రజాసేవలో ముందు వరుసలో నిలిచే వారిని గౌరవించాల్సిన అవసరం సమాజము పై ఉందని సురేఖ అన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి జడ్పీటీసీ నాగరాణి-త్రిమూర్తి, మంచిర్యాల మున్సిపాలిటీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్,నస్పూర్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ వేణు,మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు గజ్జెల హేమలత, నాయకులు ,ముని,బాలరాజు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేపల గడ్డని గ్రామపంచాయతీ చేయాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్, ప్రజా పాలన ప్రతినిధి అక్టోబర్ 11 : సుజాతనగర్.మండలంలోని వేపలగడ్డగ్రామన్ని గ్రామ పంచాయతీ చేయలని సోమవారం గ్రీవిన్స్ డే కార్యక్రమంలో జేసి గారికి వినతిపత్రం ఇవ్వడంజరిగింది. మరియు కొత్తగూడెం. ఎమ్మెల్యే క్యాంపుఆఫీసులో. ఎమ్మెల్యే వనమావేంకటేశ్వరావు. కలసీ.వారిని వేపలగడ్డ గ్రామన్ని. గ్రామపంచాయతీ. చేయలని కోరడం. జరిగింది. వేంటనే ఎమ్మెల్యే గారు. స్పందించి.తప్పకుండా వేపలగడ్డ గ్రామ న్నీ.గ్రామన్ని గ్రామ పంచాయతీ. చేస్తానాని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో రెడ్డం తులసీరెడ్డి.గారు జయరామి రెడ్డి. సుధాకర్ రెడ్డి. బచ్చలకూర శ్రీనివాస్. గంగయ్య. సత్యనారాయణ రెడ్డి. గారు. శ్యామ్ రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి. రాజయ్య. గురవారెడ్డి.చిలకరెడ్డి.రమణారెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి: డి.ఎస్.పి వెంకటరమణ



దంతాలపల్లి అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:స్థానిక మండలం కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి క్రీడలు ఎస్ ఐ మురళీధర్ రాజ్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం జరిగింది. సోమవారం ఈ కార్యక్రమానికి తొర్రూర్ డి.ఎస్.పి వెంకటరమణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు పాల్గొని టాస్ వేసి క్రీడలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. క్రీడాకారులు అంకితభావంతో పని చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అదేవిధంగా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పవచ్చు అని ఆయన తెలిపారు. యువత దేశ అభివృద్ధికి తోడ్పాటు నందించే విధంగా నవ సమాజ నిర్మాణం కీ నాంది కర్తలుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రశ్చత్య సంస్కృతి మూలంగా నేటియువత చెడు వ్యసనాలకు లోనై భవిష్యత్తును అంధకారం చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలు యువకులు విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు అనగా గంజాయి గుట్కా అంబర్ దొంగతనాలు బెల్లం గుడుంబా ఇసుక రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా యువత సోషల్ మీడియా పట్ల మరియు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.క్రీడల్లో యువకులు విద్యార్థులు పాల్గొని వారి యొక్క ప్రతిభను కనపరచి నట్లయితే వారిని ఉన్నత స్థానంలోకి వెళ్లే విధంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో పేద మధ్యతరగతి కుటుంబాల యువతీ యువకులు ఇంటర్ మరియు డిగ్రీ చదివి ఉత్తీర్ణులైన వారికి పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ఎస్ఐ పోస్టులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని పోలీసు ఉద్యోగాల పట్ల మక్కువ ఉన్న విద్యార్థినీ విద్యార్థులు యువకులు స్థానిక పోలీస్ స్టేషన్లో వారి యొక్క పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పేద విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని పేద నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దంతాలపల్లి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ భానోత్ కృష్ణ కానిస్టేబుల్ బగ్గ రాజారాం సిఐ గన్మెన్ యాకన్న క్రీడాకారులు వార్తా ప్రభ, పెన్ పవర్ %జ%3 ఛానల్, తెలంగాణ ఎక్స్ప్రెస్ , ప్రజా పాలన, సూర్య, జ్యోతి, పత్రికా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పట్లూరులో బతుకమ్మ చీరలు పంపిణీ: మర్పల్లి ఎంపిడిఓ వెంకట్రామ్ గౌడ్



వికారాబాద్ బ్యూరో 11 అక్టోబర్ ప్రజాపాలన : మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని మర్పల్లి మండల ఎంపిడిఓ వెంకట్ రామ్ గౌడ్ అన్నారు. సోమవారం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మర్పల్లి మండలానికి చెందిన పట్లూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్, ఎంపిటిసిలు స్వప్న సురేష్, మంజుల మహేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు బతుకమ్మ చీరలను తయారు చేశారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల దుర్భర పరిస్థితిని కొంతైనా తీర్చడానికి బతుకమ్మ చీరల ద్వారా వచ్చే ఆదాయంతో వారి కష్టాలు తీరుతాయని వివరించారు. గ్రామ ప్రవేశ రోడ్డు మార్గానికి ఇరుప్రక్కల ఉన్న మొక్కలకు వైట్ పెయింటింగ్ అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. మొక్కల చుట్టూ సాసరింగ్ గుంతలు ఏర్పాటు చేయాలని పట్లూరు గ్రామ కార్యదర్శి సంతోషకు సూచించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన 7 రిజిస్టర్లను పరిశీలించామని స్పష్టం చేశారు. రిజిస్టర్ లను మళ్లీ గ్రామాన్ని విజిట్ చేసే వరకూ అప్డేట్ చేయాలని సూచించారు. రిజిస్టర్ లను అప్డేట్ చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి వచ్చిన సుమారు మూడు వేల బతుకమ్మ చీరలలో సోమవారం 500 చీరలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు దేవరదేశి అశోక్ వార్డు మెంబర్లు నర్సింలు, ఖాజా, లాలు, ప్రభు, అంజాద్, సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్ల ముసలి అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, సోషల్ మీడియా ఇంచార్జ్ వికాస్, నాయకులు శ్రీశైలం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల నుండి రసూల్ పల్లి వరకు జాతీయ రహదారి నిర్మించండి: ఎంపి వెంకటేష్ నేత




మంచిర్యాల బ్యూరో, అక్టోబర్11, ప్రజాపాలన : మంచిర్యాల నుండి రసూల్ పల్లి వరకి13 కిలోమీటర్ల వరకు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మించాలని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత పేర్కొన్నారు. సోమవారం ఎన్ హెచ్ ఎ ఐ చైర్మన్, సెక్రటరీ గిరిదర్ అమరనె ఐఎఎస్ గారిని మరియా దపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గం లోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. మంచిర్యాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నుండి రసూల్ పల్లి వరకు గల 13 కిలోమీటర్ల జాతీయ రహదారి ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉండటం వలన ప్రయానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిత్యం సింగరేణి కార్మికులు పెద్దపెల్లి మంచిర్యాల జిల్లాల ప్రజలు రాకపోకలు ఎక్కువ జరుగుతున్న సందర్భంగా దీని వలన ట్రాఫిక్ అంతరాయం తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ 13 కిలోమీటర్ల జాతీయ రహదారిని నాలుగు వరసల జాతీయ రహదారిగా మార్చి డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ తో పాటు 14 జంక్షన్ల సుందరీకరణ, 8 బ్లాక్ స్పాట్ ల నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాలు నివారించి, ప్రమాద రహిత రహదారిగా మార్చాలని కోరారు.

# పార్టీని మరింత పటిష్టం చేస్తాం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిది :ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలం పరిధిలో గుంగల్ గ్రామంలో జెండా కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు జెండా ఆవిష్కరించారు. టిఆర్ఎస్ పార్టీగ్రామఅధ్యక్షులు అర్చన రమేష్, గ్రామ ప్రధాన కార్యదర్శి కుంటి శ్రీకాంత్. మాట్లాడుతూ గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే గారి సూచన మేరకు పార్టీని ప్రతిష్ట చేస్తామని సంక్షేమ పథకాలు పార్టీని ముందుకు తీసుకెళ్తాం అంటూ దేశంలో లేని విధంగా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ కు ప్రత్యేక అభినందలు తెలియజేస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పనిచేస్తూ నార్ అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంద్ర శ్రీనివాస్ , ఉప సర్పంచ్ భీమ్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్రెడ్డి, జడ్పిటిసి చిన్నోళ్ళు యాదమ్మ, మండల అధ్యక్షులు కర్నాటి రమేష్, ప్రధాన కార్యదర్శి పార్చ భాష , నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ భాయ్, నూతన కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ సంఘ నరేష్, సెక్రెటరీ అందుగుల మహేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## 60 లక్షల నోట్లతో అలంకరించిన ధనలక్ష్మి దుర్గా మాత అలంకరణ



బెల్లంపల్లి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి:దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెల్లంపల్లి పట్టణం లోని కన్యకా పరమేశ్వరి దేవాలయం లో 5వ రోజు కార్యక్రమంలో భాగంగా ధనలక్ష్మి అవతారాన్ని 60 లక్షల రూపాయలతో అత్యంత సుందరంగా అలంకరించారని స్థానిక ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోనే అత్యంత అద్భుతంగా అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు దాండియా నృత్యాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డిని కలిసిన వికారాబాద్ కాంగ్రెస్ నాయకులు



వికారాబాద్ బ్యూరో 11 అక్టోబర్ ప్రజాపాలన : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వంలో వికారాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి, దారుర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల రఘువీరారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని టీ పిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని సూచించారు గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ జెండాను చేర్చాలని హితవు పలికారు కార్యకర్తల్లో చైతన్యం తేవాలని టిఆర్ఎస్ ప్రభుత్వం చేసే తప్పులను ఎండగట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆలంపల్లి హాజీ వారి అనుచరులు.

## రెండున్నర కోట్ల కుంభకోణం పై విచారణ జరిపించాలి: పేరం శ్రీనివాస్ ఐఎన్టియుసి



బెల్లంపల్లి, అక్టోబర్ 11, ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి సంస్థ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల నియామకాల్లో దాదాపు 2కొట్ల 50 లక్షల రూపాయల కుంభకోణం జరిగిందనీ దీని పై తక్షణమే విచారణ జరిపించి దోషులను శిక్షించాలని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ నియామకాలకు స్థానిక కాంట్రాక్టరు ఒక్కో సెక్యూరిటీ గార్డు నుండి ఒక లక్ష 30 వేల రూపాయల చొప్పున 200 మంది సెక్యూరిటీ గార్డ్ ల నుండి దాదాపు రెండున్నర కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని ఈ విషయంపై వెంటనే విచారణ జరిపించి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సెక్యూరిటీ గార్డ్ నియామకాల్లో సింగరేణి అధికారులు,సెక్యూరిటీ అధికారులు,కంట్రాక్టరు, సూపర్ వైసర్ ప్రధాన నిందితులని.ఈ నలుగురు కుమ్మక్కై అమాయకులైన,నిరుద్యోగ యువకులను ఉద్యోగాల ఎర వేసి లక్షల రూపాయల అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఈ అవినీతి లో పాల్గొన్న సింగరేణి అధికారులను సస్పెండ్ చేయాలనీ,కంట్రాక్టరు యొక్క కాంట్రాక్టు రద్దు చేయాలని, సూపర్ వైసర్ వద్ద ఉన్న ఈ డబ్బును అమాయక నిరుద్యోగ యువకులకు ఇప్పించి,ఈ సూపర్వైజర్ అరెస్టు చేసే వరకు ఐ ఎన్ టి యు సి పోరాట కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

## సీతారాం పేట్ వ్యాక్సినేషన్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 ప్రజాపాలన ప్రతినిధి : ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని సీతారాం పేట్ గ్రామం ప్రజలను దృష్టిలో ఉంచుకొని కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టడానికి సింగిల్విండో చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యాక్సిన్ కార్యక్రమము సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ వచ్చి మనస్ఫూర్తిగా వ్యాక్సిన్ వేసుకోవడం జరిగిందని ఏడవ వార్డు కౌన్సిలర్ కొండ్రు శ్రీలత రాంబాబు తెలిపారు. గ్రామంలో టీకాలు వేయించు కొని వారెవరైనా ఉన్నట్లయితే త్వరగా సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ శ్రీ లత రాంబాబు తెలిపారు.

## కట్టగాంధీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



మధిర అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి : మధిర పట్టణంలోని హరిజనవాడ కాలనీలో విద్యుత్ ప్రమాదం కారణంగా నష్టపోయినా కోమటి రాజేశం కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పి 22 వ వార్డు కౌన్సిలర్ కట్ట గాంధీ నేతృత్వంలో వారి కుటుంబానికి దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందజేసిన సిపిఎం పార్టీ మధిర పట్టణ కార్యదర్శి మండవ ఫణీంద్ర కుమారి ,మరియు పట్టణ కమిటీ సభ్యులు అనుమోలు భాస్కర్ రావు ,వాసిరెడ్డి సుందరయ్య ,ఆవుల శ్రీనివాసరావు ,తేలప్రోలు రాధాకృష్ణ ,పంతంగి నాగయ్య ,పెంటి వెంకట్రావు ,మల్లా చారి తదితరులు పాల్గొన్నారు




# ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 12,అక్టోబరు 2021


## మంచుకొండల ఆత్మఘోష

మంచుకొండల కాశ్మీరం మళ్ళీ రక్తమోడుతోంది. బరి తెగించిన ముష్కరుల దాడుల్లో అమాయకులు బలి కావడం పెరిగింది. కొద్దిరోజులుగా జమ్మూ %--% కశ్మీర్‌లో జరుగుతున్న వరుస సంఘటనల్లో అక్కడి అల్పసంఖ్యాక వర్గాలైన కశ్మీరీ పండిట్లు సహా అనేకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. భద్రతాదళాల ప్రాణత్యాగం చేయడం ఎన్నో ఏళ్ళుగా చూస్తున్నాం. కానీ, గడచిన ఆరేళ్ళ గణాంకాల లెక్కలు తీస్తే తీవ్రవాదులు రూటు మార్చి, భద్రతాదళాల బదులు ఇప్పుడు పౌర సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు అర్థమవుతోంది. పేరున్న వ్యక్తులు, కశ్మీర్ లోయలోని స్థానికేతరులను తీవ్రవాదులు పొట్టనబెట్టుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ పండిట్ అయిన ప్రసిద్ధ కెమిస్ట్ సహా ముగ్గురు పౌరులను మంగళవారం కొద్ది గంటల వ్యవధిలో తీవ్రవాదులు కాల్చి చంపడం అందుకు ఉదాహరణ. వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ సహా పార్టీలన్నీ దీన్ని ఖండించాయి. ఆ రక్తపుమరకలు ఆరక ముందే గురువారం శ్రీనగర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలోకి తుపాకీలు ధరించిన ఆగంతుకులు చొచ్చుకు వచ్చి, టీ తాగుతున్న ప్రిన్సిపాల్‌పై, మరో కశ్మీరీ పండిట్ టీచర్‌పై అతి సమీపం నుంచి కాల్పులు జరిపి, ప్రాణాలు తీయడం మరో తీరని విషాదం. జనంతో మమేకమయ్యేందుకు కేంద్ర మంత్రులు పలువురు తొమ్మిది వారాల కార్యక్రమం చేస్తున్న సమయంలో గత పది రోజుల్లో ఇలా ఏడుగురు పౌరులు బలి కావడం గమనార్హం. బీజేపీ తెచ్చిన పునర్వ్యవస్థీకరణ చట్టంతో కొత్తగా ఏర్పడ్డ ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఈ నెలలోనే హోమ్ మంత్రి అమిత్ షా కూడా పర్యటించాల్సి ఉంది. ఆ సమయంలో ఈ వరుస దాడులు, హత్యలు కలవరపరిచే విషయాలు. కాశ్మీరం కళకళలాడుతోందంటున్న పాలకుల మాటల్లోని డొల్లతనానికి నిదర్శనాలు. మతపరంగా అస్థిరతను సృష్టించి, అల్పసంఖ్యాకుల్లో భయాన్ని పెచ్చరిల్ల జేయడం కోసమే ఈ దాడులని సాక్షాత్తూ డీజీపీయే చెప్పారు. 2016 నుంచి గత ఆరేళ్ళలో కశ్మీర్‌లో ఇదే ధోరణి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉత్తిపుణ్యానికి 27 మంది పౌరుల ప్రాణాలు తీవ్రవాదపు కోరలకు చిక్కాయి. తాజాగా ఆరెస్సెస్‌కు పని చేస్తున్నారంటూ సుప్రసిద్ధ ఫార్మసిస్టునూ, పోలీసు ఇన్ఫార్మర్ అంటూ బీహారీ వీధి వర్తకుణ్ణీ %--% ఇలా రకరకాల నెపాలతో తీవ్రవాదులు దారుణకాండకు దిగుతున్నారు. పాకిస్తాన్‌లోని లష్కరే తాయిబాకు ఇక్కడి మరోరూపమైన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్', మరోపక్క 'ఇస్లామిక్ స్టేట్ ఇన్ జమ్మూ కశ్మీర్' లాంటి వేర్వేరు సంస్థలు ఈ దారుణాలకు పాల్పడింది తామేనని ప్రకటించుకోవడం నివ్వెరపరుస్తోంది. నిఘా వర్గాల వైఫల్యాన్ని పట్టి చూపిస్తోంది.కశ్మీర్‌లోని ప్రముఖ వ్యాపారులే లక్ష్యంగా కొన్నాళ్ళుగా దాడులు జరుగుతున్నాయి. ఏ వర్గంతోనూ సంబంధం లేని అమాయకులను చంపడం ద్వారా దశాబ్దాలుగా అక్కడ శాంతియుతంగా జీవిస్తున్న అల్పసంఖ్యాకులను భయపెట్టడమే పరమార్థం. పండిట్లు కశ్మీర్‌కు సత్వరమే తిరిగొచ్చేందుకు వీలు కల్పిస్తూ, ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించడమే తీవ్రవాదుల దృష్టిలో ఆ ఫార్మసిస్టు చేసిన తప్పు. కశ్మీర్‌కు తిరిగిరావాలనుకొనే వారిని హెచ్చరించడమే వారి ఉద్దేశం. 'స్థానికులు కానివారెవరూ ఇక్కడకు రాకూడదు, జీవనం గడపకూడద'న్న అవాంఛనీయ ధోరణికీ, అసహనానికీ ఈ ఘటనలు సూచిక. ఈ నీచప్రయత్నాలకు ప్రభుత్వం ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. రోజువారీ వ్యవహారంగా మారిన హింసకు ముగింపు పడేలా చూడాలి. ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వానికి తావివ్వకుండా పగ్గాలను తమ చేతిలోనే ఉంచుకోవాలనే ధోరణినీ సత్వరమే వదిలించుకోవాలి. ఏళ్ళూపూళ్ళ కశ్మీర్ సమస్యకు పైపూతలు పనికిరావు. లోతైన పరిష్కారమే శరణ్యం. జరుగుతున్న ప్రతి దాడీ, పోతున్న ప్రతి ప్రాణం గుర్తుచేస్తున్నది అదే! ఇలాంటి పరిస్థితుల్లోనూ ముష్కరుల చేతిలో ఫార్మసిస్టు మఖన్‌లాల్ బింద్రూ అసువులు బాసినప్పుడు, ఆ కుటుంబ సభ్యులు గుండె దిటవుతో మాట్లాడిన తీరు జాతికి స్ఫూర్తిదాయకం. 'ఆ దుండగులు తుపాకులతో ఈ దేహాన్ని కాల్చవచ్చు. కానీ, మా ఆత్మనూ, మా ఈ స్ఫూర్తినీ చంపలేరు' అన్న ఉద్వేగభరితమైన మాటలు చాలాకాలం చెవులలో రింగుమంటాయి. తీవ్రవాదం పంజా విసిరిన 1990లలో ఎందరో పురిటిగడ్డను వీడిపోయినా, హిమసీమలనే అంటిపెట్టుకొని బతుకుతున్న ఇలాంటి కొద్ది కశ్మీరీ పండిట్ల కుటుంబాల నైతిక స్థైర్యం అనుసరణీయం. అక్కడ ఇప్పుడు అందరికీ కావాల్సిన పరమౌషధం అదే. మరి, అంతటా భయం, అందరిపైనా అనుమానం నెలకొన్న కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి పాలకులు ఏం చేస్తున్నారు? జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికో, ఎన్నికల ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికో 'నయా కశ్మీర్ నిర్మాణం' నినాదాలను కేంద్ర పాలకులు ఎత్తుకుంటే సరిపోతుందా? కశ్మీర్‌పై పాకిస్తాన్ కుయుక్తులు, ఈ దాడులతో ప్రజలకు చేరవేయదలుచుకున్న భావం ఏమిటో తెలుస్తూనే ఉంది. కానీ, అదే సమయంలో కశ్మీర్‌లో నిద్రాణంగా ఆగ్రహం, బాధ, ఆవేదన గూడుకట్టుకున్నాయన్నది వాస్తవం. ఆ సంగతి గుర్తించాలి. భారత అనుకూల భావాలు తగ్గుతూ, వేర్పాటువాదానికి ఊతం అందుతున్న తీరును ఇప్పటికైనా పాలకులు గ్రహించాలి. ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాలను కలుపుకొని, తగిన చర్యలు చేపట్టాలి. జూన్‌లో ప్రధాని జరిపిన అఖిలపక్షం తదుపరి కర్తవ్యాన్ని చేపట్టాలి. అలా కాకుండా, పెట్టుబడులు, పర్యాటకులు, రోడ్ల నిర్మాణం, విద్యుదుత్పత్తి లాంటి మాటలు చెప్పి, గణాంకాల లెక్కలతో కశ్మీర్ శాంతిసౌభాగ్యాల సీమ అని నమ్మబలికితే అది ఆత్మవంచనే. కశ్మీరే కాదు... దేశం దాన్ని ఎంతోకాలం భరించలేదు.

# ఆ మృత్యుశకటానికి అహంకారమే ఇంధనం



అది ఆదివారం. రైతులు ఆందోళన చేస్తున్నారు. కేంద్ర హోంమంత్రి గారు వస్తున్నారని తెలిసింది. ఆయన కారుకు అడ్డం పడి నిరసన తెలియజెప్పాలనుకున్నారు. కానీ ఒక నల్ల కారు వెనుకనుంచి రైతుల మీదుగా దూసుకువచ్చింది. నలుగురి ప్రాణాలు పోయాయి. రైతులే దాడి చేశారనే ప్రచారాన్ని పకడ్బందీగా నిర్వహించారు. కారుపైన కూర్చుని నడపడం వారికి ఒప్పు. కారు కింద పడడం వీరికి తప్పు. మంత్రి గారి కుమారుడి కారో, తండ్రి గారి కాన్వాయ్ కారో తెలియదు. ఆ కారు శరీరాలను నుజ్జు చేస్తూపోయిన సంగతి మాత్రం తెలుసు. మరణాలు నిజంబీ కారణాలు, కారకులు, బతికున్న నేరగాళు బయటపడరు. నిర్జీవ శవాలు మాత్రం దాక్కోలేవు, మరణించిన మానవత్వానికి క్షీణించిన నమపాలనకు నజీవ సాక్ష్యాలుగా మిగిలిపోతాయి. కానీ వారి సాక్ష్యం ఎవరూ వినరు. శవపరీక్షలు చేసిన డాక్టర్ల నిజాయితీ బతికి ఉంటే, నిజాయితీ ఉన్న డాక్టర్లు బతికి ఉంటే, న్యాయం బతికే అవకాశం. చివరకు మిగిలేవి ప్రాణం లేని నివేదికలు, బూడిద. సుప్రీంకోర్టు స్వయంగా ఎవరినైనా అరెస్టు చేస్తున్నారా ఇప్పుడికైనా అని అడిగింది. నిజానికి ఆ ప్రశ్న మొత్తం భారతీయ జనులది. జనం తలలు శరీరాలు చిదిమేస్తూ ఏలినవారి అధికారిక వాహనాలు మరణ మృదంగం మోగించడం కన్నా ఘోరం ఏమంటే దాని తరవాత నిర్వహించవలసిన బాధ్యతలు వదిలేయడం. వీడియో ప్రసారాలు నిషేధించారు. రాజకీయ వికృత కల్లోలాలు. ఇంటర్నెట్ సేవల రద్దు, ప్రతిపక్ష నాయకుల రాకపోకలపై నిషేధం. నగర ప్రవేశంపై అనేకానేక నిర్బంధాలు. తప్పుడు కథనాలు, కావాలని సృష్టించిన అనుమానాలు. నేరాలు దాచే ప్రయత్నాలు చేయడం, మీడియా నోరు నొక్కడం, తలలు చిదిమేయడమే కాదు తలపును కూడా చిదిమేసే ప్రయత్నాలు జరగడం. దేశ భద్రత కోసమే ఆ కఠిన నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. పోతే పోయింది ఇంటర్నెట్. చట్టాలను ఆమోదించకపోతే ప్రాణాలకు ప్రమాదం అని నిరసనకారులకు ఇంకా ఎందుకు తెలియడం లేదో ప్రభువులకు అర్థం కాదు, మృత్యుశకటానికి అహంకారమే ఇంధనం కదా. అన్నిటికన్నా భయంకరమైనది నిస్సిగ్గు. బాహాటంగా తమ వీపు తామే తట్టి మెచ్చుకోవడం, వెంటనే విచారణకు ఆదేశించినందుకు ముఖ్యమంత్రి చురుకైన కార్యశీలతను ప్రశంసిస్తూ అభినందించడం, అందుకోసం లజ్జను త్యాగం చేసే మహాసంస్థలు, అతిరథులు, మహారథులు ఎందరో. కొందరు నోరు విప్పరు. కొందరు నోరువిప్పితే అన్నీ అబద్ధాలే. నలుగురు రైతులతో సహా ఎనిమిది మందిని నలిపేసిన ఈ క్రూర, అధికార, అహంకార దుర్మార్గాన్ని సంయుక్త కిసాన్ మోర్చా ఖండిస్తున్నది. సుప్రీంకోర్టు స్వయంగా విచారణకు స్వీకరించి ఏం జరిగిందో, ఏం చేశారో, ఏం చేస్తారో చెప్పండి అని అడిగింది. ఈ పని చేయవలసింది డీజీపీ, హోంమంత్రి, ముఖ్యమంత్రి. వారంతా ప్రతిపక్షాలను ఎలా కట్టడి చేయాలా అని తమ రాజకీయ అనుభవాన్ని వాడుతూ ఆలోచిస్తుండటం వల్ల వారికి తీరిక లేదని గమనించి సుప్రీంకోర్టు దయతో ఆ బాధ్యతను స్వీకరించింది. రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత సుప్రీంకోర్టుదే కదా మరి. బ్రిటిష్ క్వీన్స్ కౌన్సిల్‌గా అత్యంత ప్రఖ్యాతుడైన హరీశ్ సాల్వేగారు ఉత్తర ప్రదేశ్ అధికార యంత్రాంగం తరఫున వాదిస్తున్నారు (ఫీజెంత అని అడక్కండి). తదుపరి చర్యలేవీ బాగా లేవని న్యాయమూర్తులు పెదవి విరుస్తున్నారు. "ప్రశ్నించడానికి రమ్మన్నాం. రాకపోతే మంత్రి అజయ్ మిశ్రా కొడుకు ఆశీష్ మిశ్రాకు చట్టం కాఠిన్యం ఏమిటో చూపిస్తాం" అని హరీశ్ సాల్వే హామీ ఇచ్చారు. మంత్రికొడుకు ఇంటి ముందు జాగ్రత్తగా నోటీసు అంటించి వచ్చారు. అవును. అరెస్టు చేసే ముందు అన్ని హక్కులూ అరెస్టు కాబోయే వారికి కల్పించాలి. ఎన్ని నిందలొస్తే మాత్రం ఆయన బీజేపీ నాయకుడే అవుతాడు గానీ నిందితుడని అనగలమా? మన రాజ్యాంగం వారికిచ్చిన చాలా హక్కులు వాడుకోవలసిందే. అధికార పక్షం కాని వారికి కూడా ఆ హక్కులు ఇస్తే బాగుండేదనే ఒక సూచన. ఎట్టకేలకు ఆయనను అరెస్టయితే చేశారు!దేశ హోంశాఖ సహాయ మంత్రిని డిస్మిస్ చేయాలని శిరోమణి అకాలీదళ్ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఇంకా ఆయనను మంత్రి పదవిలో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. డిమాండ్ చేయగానే డిస్మిస్ చేస్తే అసలు మంత్రి వర్గాలేవీ ఉండవు. మంత్రులు లేకపోతే, అందులోనూ హోంశాఖ సహాయ మంత్రి లేకపోతే దేశ వ్యవహారాలన్నీ ఎవరు నడిపిస్తారు?బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ ఈ అధికార అహంకార కారు వీడియోను జనం ముందుకు తెచ్చారు. కావాలని రైతుల వెనుకనుంచి దూసుకొచ్చి ఓ నల్ల ఎస్‌యూవీ కారు వారి శరీరాల మీదుగా వేగంగా నడిచిపోతున్నట్టు స్పష్టంగా ఉంది. రైతులే మంత్రి కారు మీద దాడి చేశారన్నది ప్రచారం. 'ఈ వీడియో స్పష్టంగా ఉంది. నిరసనదారుల నోళ్లను హత్యల ద్వారా మూయలేరు. రోడ్డుమీద చిందిన అమాయక రైతుల నెత్తురుకు ఎవరు బాధ్యత వహిస్తారు. ఈ క్రూర దురహంకార చర్యలను ఆపలేరనే సందేశం చేరకముందే న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలగజేయా'లని వరుణ్ గాంధీ ట్వీట్ వ్యాఖ్య చేశారు. మంత్రిగారిని మంత్రివర్గం నుంచి తొలగించలేదుబీ కానీ వరుణ్, మేనకాగాంధీలను బీజేపీ కార్యవర్గం నుంచి అక్టోబర్ 7న తొలగించేశారు. ఇక అంతర్ 'గత' ప్రజాస్వామ్యం గురించి చెప్పేదేముంది!

# ప్రైవేట్‌పై చైనా కొరడా మతలబు?!

మావో అనంతర పాలకులు కమ్యూనిస్టు పార్టీలో, ఆర్థిక కార్యకలాపాల్లో ప్రైవేట్ వాణిజ్యవేత్తలకు చోటు కల్పించడం, రాజ్యాంగాన్ని మార్చడంద్వారా చైనాను వృద్ధి బాట పట్టించారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించే ఆర్థిక విధానాలు చైనాను ఆర్థిక దిగ్గజంగా మార్చినప్పటికీ, పట్టణ%--%గ్రామీణ, తీరప్రాంత%--% మైదాన ప్రాంతాల మధ్య విభజనలు బాగా పెరిగాయి. గత మూడు దశాబ్దాలుగా చైనా సమాజంలో ఒక నయా సంపన్న వ్యవస్థ బలపడి కమ్యూనిస్టు పార్టీకి, దాని సిద్ధాంతానికి ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగాన్ని నియంత్రించడానికి చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ చేస్తున్న ప్రయత్నాలు సోషలిస్టు సిద్ధాంతానికి తిరిగి మళ్లడం, సమాజంలోని వ్యత్యాసాలను తగ్గించడం అనే లక్ష్యానికి అనుగుణంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కానీ, ఆర్థిక కొలమానాల్లో అత్యున్నత స్థానంలో ఉంటున్న చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ బలిష్టంగానే ఉంది తప్ప కుప్పగూలిపోయే స్థితిలో మాత్రం లేదు.చైనా ఆర్థిక వ్యవస్థలో ఇటీవలి పరిణామాలు, ప్రత్యేకించి అలీబాబా గ్రూప్, ఎవెర్ గ్రాండే వంటి ప్రైవేట్ కంపెనీలు ఎదుర్కొన్న సమస్యలు... చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ త్రీ రెడ్ లైన్ పాలసీపై, ప్రైవేట్ రంగంపై ప్రభుత్వ వైఖరి, దాని ఉద్దేశాలపై ప్రశ్నల్ని లేవనెత్తుతున్నాయి. చైనా స్థూల దేశీయోత్పత్తిలో 60 శాతం, సాంకేతిక ఆవిష్కరణల్లో 70 శాతాన్ని ప్రైవేట్ రంగమే అందిస్తోంది. 1995లో ప్రైవేట్ రంగం చైనాలో 18 శాతం ఉద్యోగాలను కల్పించగా 2018లో అది 87 శాతానికి పెరిగింది. చైనా ఎగుమతులు ఇదే కాలానికి గాను 34 శాతం నుంచి 88 శాతానికి పెరిగాయి. పై ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ముందు చైనా ఆర్థిక వ్యవస్థ ఎలా నిర్మాణమైందో మనం అర్థం చేసుకోవడానికి అయిదు అంశాలను పరిశీలించాలి.

మొదటిది: 1950లు, 60లలో మావో సేటుంగ్ పాలనలో నిఖార్సైన కమ్యూనిస్టు సైద్ధాంతిక పునాదిపై, అటు సోవియట్ సహాయం, ఇటు స్వావలంబనకు పిలుపివ్వడం అనే రెండింటి సమ్మేళనంతో, దేశంలో పారిశ్రామిక పునాదిని నిర్మించడంపై చైనా గట్టిగా కృషి చేసి మరీ విజయం సాధించింది. అయితే 1970లు, 80లలో డెంగ్ జియాంవో పింగ్ అంతర్జాతీయ సహకారంతో ఆర్థికాభివృద్ధిపై ఎక్కువగా దృష్టిపెట్టారు. 1990లలో నాటి దేశాధ్యక్షుడు జియాంగ్ జెమిన్ సైద్ధాంతిక, ఆర్థిక రంగాల్లో సంస్కరణలతో చైనాను అత్యధిక వృద్ధి స్థాయికి తీసుకెళ్లారు. కమ్యూనిస్టు పార్టీలో, ఆర్థిక కార్యకలాపాల్లో ప్రైవేట్ వాణిజ్యవేత్తలకు చోటు కల్పించడం, ఈ మేరకు రాజ్యాంగంలో కూడా మార్పులు తీసుకోవడం ద్వారా చైనాను వృద్ధి బాట పట్టించారు. ప్రైవేట్ యాజమాన్యానికి పలు హక్కులు కల్పిస్తూ ఒక నిబంధనను చేర్చారు. ప్రైవేట్ వ్యాపారులు కమ్యూనిస్టు పార్టీ నియంత్రణలో పనిచేయాల్సి ఉందని, పార్టీ పాలనకు వారు బేషరతుగా లోబడి ఉండాలని షరతు కూడా విధించారు.

రెండు: ఈ విధానాల ఫలితంగా, 1978 నుంచి 2003 నాటికి ఎగుమతుల పరిమాణం 28 రెట్లకు పెరిగింది. 1952 నుంచి 1978 కాలంలో ఎగుమతుల్లో సాధించిన రెండు రెట్ల వృద్ధితో పోలిస్తే ఇది భారీ స్థాయి వృద్ధి అని చెప్పాలి. 1978%--%2003 కాలంలో సంస్కరణలు అమలు చేసి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించడానికి సుంకాలు, పన్నులు, వాణిజ్య ప్రోత్సాహకాలను ప్రతిపాదిస్తూ నాలుగు ప్రత్యేక ఆర్థిక మండళ్లను నెలకొల్పారు. ఎగుమతులను, అత్యున్నత టెక్నాలజీని దిగుమతి చేసుకోవడాన్ని ప్రోత్సహించడమే వీటి లక్ష్యం. దీంతో 1952లో చైనా జీడీపీలో పారిశ్రామిక రంగ వాటా 8 శాతం మాత్రమే ఉండగా, 2003 నాటికి 52 శాతానికి పెరిగింది. ప్రపంచ జీడీపీలో చైనా వాటా 1952లో 4.6 శాతం ఉండగా 2003 నాటికి 15 శాతానికి పెరిగింది. ఇక పారిశ్రామికోత్పత్తిలో విదేశీ మదుపు సంస్థల వాటా 1990లో 2.3 శాతం ఉండగా 2003 నాటికి అది 35.9 శాతానికి అమాంతంగా పెరిగిపోయింది.

మూడు: 2003 నుంచి 2013 వరకు ఒక దశాబ్ది కాలంలో చైనా వార్షిక వృద్ధి రేటు 10.3 శాతంగా నమోదైంది. 2007 నాటికి 14.2 శాతం నమోదుతో ప్రపంచంలోనే అత్యున్నత వృద్ధి రేటును చైనా సాధించింది. 2008–2019 దశాబ్దంలో ఆర్థిక మాంద్య కాలంలో చైనా సగటు వృద్ధి రేటు 7.99 శాతానికి నమోదైంది. ఇది ఆ దశాబ్దంలో ఏ దేశమూ సాధించినంత అధిక వృద్ధి రేటు. 2004లో చైనా వస్తుతయారీ రంగం 625 బిలియన్ డాలర్ల విలువను నమోదు చేయగా 2019 నాటికి అది 3,896 బిలియన్లకు అమాంతంగా పెరిగింది. ఈ అసాధారణమైన వృద్ధిరేటు వల్ల చైనా 2011లోనే ప్రపంచ తయారీరంగ కారా?నాగా మారింది. ఆ నాటికి ప్రపంచ తయారీరంగ ఉత్పత్తిలో చైనా వాటా 28.4 శాతంగా నమోదైంది. 2010లో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా ఆవిర్భవించింది.

నాలుగు: ఆర్థిక రంగ సంస్కరణలు ప్రైవేట్ భాగస్వామ్యానికి చోటు కల్పించినప్పటికీ, చైనా ప్రభుత్వరంగ సంస్థలు మొత్తం జీడీపీలో 23 నుంచి 27 శాతం వాటాను సాధించాయి. ఇవి పారిశ్రామిక రంగంలో 21 శాతం వాటాను కలిగి ఉండగా, నిర్మాణ రంగంలో 38.5 శాతం, హోల్‌సేల్, రిటైల్ రంగంలో 39 శాతం వాటాను, రవాణా, నిల్వ రంగంలో 77 శాతం వాటాను సాధించాయి. ఇక మొత్తం ద్రవ్యరంగంలో 88 శాతం, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల్లో 24.6 శాతం ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్నాయి. 2000 సంవత్సరంలో ఫార్చ్యూన్ 500 జాబితాలో ప్రపంచ వ్యాప్తంగా 27 ప్రభుత్వ రంగ సంస్థలకు చోటు దక్కగా చైనా నుంచి 9 సంస్థలు స్థానం సంపాదించాయి. 2017 నాటికి ఈ జాబితాలో మొత్తం 102 ప్రభుత్వ రంగ సంస్థలకు గాను 77 సంస్థలు చైనాకు సంబంధించినవే ఉండటం గమనార్హం. చైనా ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులు 2017లో 22,310 బిలియన్ డాలర్లతో రికార్డు సృష్టించాయి. కాగా మొత్తం 7,676 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన సరకులను అమ్మగలిగాయి. ప్రత్యేకించి బొగ్గు, ఇనుము పెద్దగా లేని లోహాలు, ఉక్కు, విద్యుత్తు, నిర్మాణ పరిశ్రమ వంటి రంగాల్లోకి చైనా భారీ పెట్టుబడులను తరలించింది. వీటిలో కొన్ని పరిశ్రమలను అధికోత్పత్తి సామర్థ్యతతో నిర్మించారు. చైనా 2000 సంవత్సరంలో ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరింది. అప్పటినుంచి 2015 నాటికి 15 సంవత్సరాల వ్యవధిలో ఏటా 13 శాతం సగటు ఉత్పత్తి రేటుతో చైనా ఉక్కు ఉత్పత్తిని అతి భారీ స్థాయిలో కొనసాగించింది. ఒక్క ఉక్కు రంగంలోనే 2018లో 8.1 శాతం వృద్ధి రేటుతో 928 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని, సిమెంట్ రంగంలో 895 మిలియన్ టన్నుల అధికోత్పత్తి సామర్థ్యాన్ని చైనా సాధించింది. ఇది ప్రపంచ అధికోత్పత్తి సామర్థ్యంలో 45 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది.

అయిదు: చైనాలో బ్యాంకింగ్ వ్యవస్థ 2016 నాటికి యూరో పియన్ యూనియన్ బ్యాంకింగ్ వ్యవస్థకంటే పెద్దదిగా మారింది. చైనా బ్యాంకుల సొంత ఆస్తుల విలువ 35 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది చైనా జీడీపీకి 3 రెట్లు ఎక్కువ. 2001 నుంచి చైనా బ్యాంకులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారీ స్థాయి మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల నిర్మాణానికి రుణాలు అందించాయి. దీంతో అధికోత్పత్తి సామర్థ్యం కలిగిన చైనా ప్రత్యేక ఆర్థిక మండళ్ళు నిర్మాణ రంగ సామగ్రిని ఈ దేశాలకు భారీగా పంపించగలిగాయి.

చైనా కమ్యూనిస్టు పార్టీ 2017లో నిర్వహించిన 19వ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మార్క్సిస్ట్ దృక్పథం, వైధానికం తోడుగా 2049 నాటికి చైనాను ఆధునిక సోషలిస్టు దేశంగా మలుద్దామని పిలుపు నిచ్చింది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించే ఆర్థిక విధానాలు చైనాను ఆర్థిక దిగ్గజంగా మార్చినప్పటికీ, గత మూడు దశాబ్దాల్లో పట్టణగ్రామీణ, తీరప్రాంత మైదాన ప్రాంతాల మధ్య విభజనలు పెరిగాయి. 2019 నాటికి ఈ విభజన భారీ స్థాయికి చేరుకుంది. తీర ప్రాంతాల్లో నివసించే ఒక శాతం జనాభా దేశ మొత్తం సంపదలో 13 శాతాన్ని అదుపులో ఉంచుకున్నది. దీంతో చైనా సమాజంలో ఒక నయా సంపన్న వ్యవస్థ బలపడి కమ్యూనిస్టు పార్టీకి, దాని సిద్ధాంతానికి ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగాన్ని నియంత్రించడానికి చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ చేస్తున్న ప్రయత్నాలు సోషలిస్టు సిద్ధాంతానికి తిరిగి మళ్లడం, సమాజంలోని వ్యత్యాసాలను తగ్గించడం అనే లక్ష్యానికి అనుగుణంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటివరకు చైనా ఆర్థిక వ్యవస్థ బలిష్ఠంగానే ఉంది తప్ప కుప్పగూలిపోయే స్థితితో అయితే లేదు.


## ఇబ్రహీంపట్నం లో క్లీన్ ఇండియా ఛాలెంజ్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి: నెహ్రూ యువ కేంద్రం క్లీన్ ఇండియా ఛాలెంజ్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ పై క్లీన్ చాలెంజ్ అవగాహన కల్పిస్తున్న ఉన్నతస్థాయి అధికారులు. దేశంలోని 744 జిల్లాలలో ప్లాస్టిక్‌ను సృష్టిస్తున్న విధ్వంసాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో క్లీన్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రవేశం పెట్టామన్నారు. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఎంపీడీవో మహేష్ బాబు ఎంపీడీవో సురేశ్రెడ్డి సర్పంచులు సీతారాం రెడ్డి చామల యాదగిరి రెడ్డి ఎంపిటిసి గంగిరెడ్డి జ్యోతి కార్యాలయ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను సమకూర్చి రీసైక్లింగ్ కు పంపించడం జరిగింది. నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రతి మండల గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ ను సేకరించి రీసైక్లింగ్ చేసేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి మొదలుకొని 30 వరకు కొనసాగుతుందని, యువత భాగస్వామ్యంతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహేయులు యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి టి. అయిజయ్య, మండల కోఆర్డినేటర్ రాజు, శివ, వెంకట్, భాస్కర్ పాల్గొన్నారు.

## సింగరేణి హెడ్ ఆఫీస్‌లో అంబరాన్నంటుతున్న బతుకమ్మ సంబరాలు

**కె. బసవయ్య. జిఎం. పర్సనల్.వెల్ఫేర్ అండ్ సిఎస్ ఆర్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,కొత్తగూడెం , అక్టోబర్ 11 ,ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో తంగేడి బంతి చామంతి గులాబీ రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలను ఘనంగా చేస్తున్న మహిళలు .ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే తెలంగాణ రాష్ట్ర సంస్కృతి , సాంప్రదాయాలకు అద్దం పట్టే తెలంగాణ రాష్ట్ర పండుగ 'బతుకమ్మ' సంబరాలను కార్పోరేట్ డిపార్ట్ మెంట్ మహిళలతో ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఆవరణలో మంగళవారం సాయంత్రం 4 గంటలనుండి బతుకమ్మ సంబరాలను అంబరాన్ని అంటే విధంగా గా అన్ని ఏర్పాట్లు చేశామని, ఆయన తెలిపారు ఈ బతుకమ్మ సంబరాల లో పాల్గొనే బతుకమ్మలకు ప్రధమ, ద్వితీయ, తృతీయ మరియు ప్రోత్సాహక బహుమతులను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు కావున కార్పోరేట్ వివిధ డిపార్ట్ మెంట్ లలో పనిచేసే మహిళలంతా ఎంతో ఉత్సాహంగా ఈ బతుకమ్మ సంబరాలలో పాల్గొనవలసిందిగా కె. జిఎం. పర్సనల్.వెల్ఫేర్ అండ్ సి.ఎస్ ఆర్. ఆయన తెలిపారు.

## మత్స్యగిరి ఆలయంలో హుండీల లెక్కింపు



యాదాద్రి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి: మండల వ రి ది. లో ని వెంకటాపురం గ్రామంలో గల శ్రీ మత్స్య గిరి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు సోమవారం గుట్ట పైన 3 నెలల 20 రోజులకుగాను 8,94,362/- రూపాయలు ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఎలిమినేడు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి,ఆలయ ధర్మకర్తల చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి,ఆలయ ధర్మ కర్తలు,గ్రామ సర్పంచ్ కొత్త నరసింహ,ఆలయ అర్చకులు,సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోరికలు తీర్చే అమ్మవారికి బోనం సమర్పించుకున్న కార్పొరేటర్



బాలాపూర్: అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: మీర్ పేట్ లోనీ బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం లోని మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పాత బస్తీ లో ప్రతి సంవత్సరం అషాడమాసం చివరి లో లేదా శ్రావణమాసం మొదటి వారం ప్రారంభంలో జరగవలసిన బోనాల పండుగ పోచమ్మ గుడి నిర్మాణంలో ఉండటంతో పలు సార్లు వాయిదా పడుతూ వచ్చిందినీ అన్నారు. గుడి నిర్మాణం పనులు పూర్తి కావటానికి ఇంకా సమయం పడుతుండడంతో బోనాల పండుగనూ గ్రామ పెద్దలు ఈ ఆదివారం జరపాలని నిర్ణయించారు. మీర్ పేట పాత గ్రామం ప్రజలు పలు కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు బోనాల ను అమ్మవారికి సమర్పించుకున్నారు. 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ బోనం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పోచమ్మ దేవత అమ్మవారికి సమర్పించుకున్నారు. కాలనీవాసులతో స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి అమ్మవారిని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. వచ్చే బోనాల పండుగ లోపు గుడి నిర్మాణం పూర్తి కావాలని పండగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ప్రజలందరూ సుఖ శాంతులతో అయు ఆరోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

## వ్యవసాయ మార్కెట్లను పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ బ్యూరో 11 అక్టోబర్ ప్రజాపాలన : పారదర్శకతతో నూతన వ్యవసాయ పాలకవర్గం ముందుకు కొనసాగాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హితవు పలికారు. సోమవారం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ధారూర్ మండల కేంద్రంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డెగావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షులుగా ముచ్చర్ల సంతోష్ కుమార్ గుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా అవుసుపల్లి అంజయ్య, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హరిదాస్ పల్లి నుండి స్టార్ ఫంక్షన్ హాల్ వరకు భారీ జనసందోహంతో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బైక్ ర్యాలీగా వెళ్లి ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తమ పరిధిలో గల రైతులకు ఉత్పత్తులను మార్కెట్ కమిటీ యార్డులోనే అమ్మేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. తూకం సమయంలో అవకతవకలు జరగకుండా మార్కెట్ కమిటీ యంత్రాంగం పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని వివరించారు. గోడౌన్లు ఆర్ బిపి కింద స్టాక్ నిల్వకోసం నిర్మించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో ధారూర్ మండల జెడ్ పిటిసి కోస్నం సుజాత వేణుగోపాల్ రెడ్డి, ధారూర్ మండల ఎంపిపి విజయలక్ష్మి, ధారూర్ మండల టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కావలి అంజయ్య, ధారూర్ మండల రైతు బంధు అధ్యక్షుడు రుద్రారం వెంకటయ్య ముదిరాజ్, ధారూర్ మండల టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కోస్నం వేణుగోపాల్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాములు, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజు గుప్తా, వైస్ ఎంపీపీ విజయ్ నాయక్, టిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెలుగుగుట్ట దేవాలయంలో చండీ హెూమం



వేడిపల్లి, అక్టోబర్11 (ప్రజాపాలన ప్రతినిధి) : శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెలుగుగుట్ట శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో 5వ రోజు శ్రీ దుర్గా పరమేశ్వరి అమ్మవారు కాశీ అన్నపూర్ణేశ్వరీగా సమస్త లోకాలకు అన్నపానీయాలు లోటులేకుండా అనుగ్రహించే అన్నపూర్ణ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు . సోమవారం ఉదయం పంచామృత అభిషేకములు, దుర్గా సూక్తం, శ్రీ సూక్తం ,విధానంతో అభిషేకము, అలాగే అలంకారము, సుహాసినులచే కుంకుమార్చన విశేషంగా నక్షత్ర హారతులు మంత్రపుష్పము తీర్థ ప్రసాద వితరణ జరిగింది. తదనంతరం చండీ హెూమం నిర్వహించారు. మహా మంగళ హారతి తీర్థప్రసాద వితరణ అత్యంత భక్తి ప్రపత్తులతో విశేషమైన భక్తజనులతో వైభవంగా జరిగినది. అన్నప్రసాద వితరణ దాతలుచే నిర్వహించబడినది.

## పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి: సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



బెల్లంపల్లి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి: పోడు భూములను సాగు చేసుకుంటున్న పేద ప్రజలకు, ఆదివాసీలకు, వెంటనే హక్కు పత్రాలను అందించాలని సిపిఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు సంకె రవి అన్నారు.సోమవారం నాడు బెల్లంపల్లి ఆర్డిఓ కార్యాలయం ముందు పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి కార్యాలయ ఇంచార్జ్ దిలీప్ కుమార్ కు మెమోరాండం అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలోని పలు మండలాల్లో తాత, ముత్తాతల నుండి వారసత్వంగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఫారెస్ట్ అధికారులు, ప్రభుత్వ అధికారులు, బిజెపి, టిఆర్ఎస్, పార్టీల నాయకులు అందరూ కలిసి పేద ప్రజల భూములను లాక్కుంటు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఇప్పటికైనా పోడు భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కు పత్రాలు అందజేయాలని వారి వేధింపులు మానుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు సాగు చేసుకుంటున్న వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంకే రవి, జిల్లా కార్యదర్శి, ఎ.రమణ, చల్లురి దేవదాసు బెల్లంపల్లి మండల నాయకులు, జంబి బాపు, నెన్నేల మండల నాయకులు, రాజన్న,పోశం,భిమేష్,శేఖర్, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి: బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్



బెల్లంపల్లి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి చేతిని, చేతిలో ఉన్న కర్రను ధ్వంసం చేశారని వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకటీ శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు.సోమవారం నాడు ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అనాగరిక చర్య అని ఎటువంటి వారైనా కూడా ఈ సంఘటనలో ఉపేక్షించకుండా వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ



శంషాబాద్: కొవిడ్ మహమ్మారి కారణంగా కొంత కాలంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన ప్రయాణికుల సంఖ్య తగ్గిన విషయం తెలిసిందే. ఇటీవల దేశం, రాష్ట్రంలో పాజిటివ్ కేసులు తగ్గిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గత నెలలో 65 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో అక్టోబర్ 9కి 77శాతానికి పెరిగిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి అన్ని దేశీయ విమానాశ్రయాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. జూలైలో 6.8లక్షల మంది దేశీయ ప్రయాణికులు ప్రయాణించగా సెప్టెంబర్‌లో వారి సంఖ్య 9.3లక్షలు ఉందని అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య గననీయంగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు.

## గ్రామ అభివృద్ధికై మేము సైతం ఫౌండేషన్ విరాళం



కోరుట్ల, అక్టోబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల మండలము లోని మాదాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ రాజేష్ పిలుపు మేరకు శాంతి భద్రతల నిమిత్తం సీసీ కెమెరాల అమర్చుటకు మేము సైతం పౌండేషన్ మాదాపూర్ సభ్యులు, మాధపూర్ గ్రామంలో 1,25,000/- రూపాయలను గ్రామ పంచాయితీ కి విరాళంగా ప్రకటించారు.అందులో బాగంగా సోమవారం రోజున సర్పంచ్ దారిషెట్టి రాజేష్ కి ముందుగా 50,000/- రూపాయలు అందజేసిన దారిషెట్టి రవీందర్.ఈ సందర్భంగా సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం గ్రామానికి సీసీ కెమెరాలు విరాళంగా ఇచ్చిన మేము సైతం పౌండేషన్ కి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగన్ పల్లి సర్పంచ్ దుంపల నర్సు రాజా నర్సయ్య, కల్లూరు సర్పంచ్ వనతడుపుల అంజయ్య , పైడిమడుగు సర్పంచ్ ధమ్మ భీమ రెడ్డి లు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి బట్టలు పంపిణీ చేసిన కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్



మేడిపల్లి, అక్టోబర్11 (ప్రజాపాలన ప్రతినిధి) :దసరా పండుగను పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ మున్సిపల్ సిబ్బందికి కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ మాట్లాడుతూ డివిజన్లో మున్సిపల్ సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణ అధ్యక్షులు రమణారెడ్డి, యూత్ అధ్యక్షులు సునీల్ పాల్ రెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, మరియు పావని తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ జూనియర్ జడ్జి శ్రీకాంత్ వీడ్కోలు సభ



మధిర అక్టోబర్ 10 ప్రజాపాలన ప్రతినిధి : మధిర కోర్టు నుండి వికారాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గా బదిలీపై వెళ్తున్న మదిర జూనియర్ సివిల్ జడ్జి శ్రీ కే శ్రీకాంత్ గారికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా న్యాయమూర్తి %ాతీఆ% కే. శ్రీకాంత్ మాట్లాడుతూ బార్, బెంచ్ సమన్వయంతో పని చేసినప్పుడే కక్షిదారులకు సరైన న్యాయం జరుగుతుందని అందుకు సహకరించిన మధిర కోర్టు న్యాయవాదులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీ డీ. ధీరజ్ కుమార్ మాట్లాడుతూ మధిర కోర్టుకు ఎంతో చరిత్ర ఉందని ఇలాంటి చరిత్రగల మధిర లో పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు భైరవభట్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరు జనార్దన్ రావు, దిరిశాల జగన్మోహన్ రావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం ,%జుజ% ప్రభాకర్ , కట్టా పూర్ణచంద్రరావు చావలి రామరాజు ,%ు%.వెంకట్రావు,%ఖ.జీఋఅవంప్ర,ఖ%. విజయ్ కుమార్ ,నెల్లూరు రవి , %వీ%.సతీష్, జి .శ్రీనివాసరావు కోర్టు సూపరిన్టెంట్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు....

## భరత్ విద్యాసంస్థల అధినేత శ్రీ శీలం. వెంకట రెడ్డి జూనియర్ కాలేజీకి బల్లలు వితరణ



మధిర అక్టోబర్10 ప్రజా పాలన ప్రతినిధి మధిర లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకి వితరణగా 10 బెంచీలు ఇచ్చినారు.మరో 10 బెంచీలు కూడా త్వరలో తయారు చేయించి ఇస్తామని హామీ ఇచ్చారని మధిర ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గారు జయదాస్ గారు,ఓ ప్రకటనలో తెలియజేసినారు.ఈ విషయమై ప్రిన్సిపల్ మరియు అధ్యాపక సిబ్బంది ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విషయంలో చొరవచూపిన హిందీ లెక్చరర్ %ాస%. దస్తగిరి కళాశాల ప్రిన్సిపల్ అభినందనలు తెలియజేశారు.

## విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన



వికారాబాద్ బ్యూరో 11 అక్టోబర్ ప్రజాపాలన : రైతులకు విత్తన శుద్ధి, పంట అధిక దిగుబడులు సాధించడం వంటి విషయాలను అవగాహన కల్పించానని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ వ్యవసాయ కళాశాల విద్యార్థి గౌండ్ల రాకేష్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా డెంగ్లూర్ తాలూకా మరికల్ గ్రామంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వ్యవసాయ కళాశాలలో బిఎస్సి అగ్రికల్చరల్ చివరి సంవత్సరం విద్యను అభ్యశిస్తున్నాడు. రూరల్ అవేర్నెస్ వర్క్ ఎక్స్పీరియన్స్ (ఆర్ఎడబ్ల్యూఈ), అగ్రో ఇండస్ట్రియల్ అటాచ్మెంట్ (ఎఈఎ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా విత్తన శుద్ధి ఎలా నిర్వహించుకోవాలో డెమో తీసుకుని రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో తన ఉపాధ్యాయుల సూచనలు సలహాలతో రూరల్ అవేర్నెస్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండల పరిధిలోని కామారెడ్డిగూడ గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. మట్టి ద్వారా విత్తనాలకు సంక్రమించే వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఆరు నెలల శిక్షణలో భాగంగా కామారెడ్డిగూడ రైతులకు అవగాహన కల్పించారు.

## అరుర్ లో ఆస్పత్రికి ప్రహరీ గోడ నిర్మాణం



యాదాద్రి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి : వలిగొండ మండల పరిధిలోని ఆరూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణానికి అప్పారెడ్డిపల్లి వాస్తవ్యులు తుమ్మల వెంకట్ నారాయణ రెడ్డి అమ్మ విమలమ్మ జ్ఞాపకార్థంగా 40 వేల రూపాయలతో ప్రహరీ గోడను నిర్మించారు.వారికి ఏఎన్ఎం శోభారాణి హాస్పటల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| ఓవి.దుర్గారావు | భద్రాద్రి కొత్తగూడెం | 9581872881 |
| జె.రాంబాబు | అశ్వరరావుపేట | 9505678245 |
| బి.శ్రీకాంత్ | భద్రాచలం | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | సుజాతనగర్ | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కె.సత్యం | పటాన్‌చెరు | 9866500289 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నందు | ఎర్రుపాలెం | 7416156349 |


## సీసీ కెమెరాలకు సొంత డబ్బులు ఇస్తున్న కార్పొరేటర్



బాలాపూర్: అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ అల్మాస్గూడ లో కె ఎం ఆర్ అపార్ట్మెంట్ సిసి కెమెరాల కు తన సొంత డబ్బులు స్థానిక కార్పొరేటర్ పద్మా ఐలయ్య యాదవ్ పదివేల రూపాయలు అది అపార్ట్ మెంట్ లో ఉన్న సభ్యులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.... అపార్ట్మెంట్ లో కొత్తవాళ్ళు వచ్చిన గుర్తుపట్టడానికి ఉందని అన్నారు. అపార్ట్మెంట్ లో ఉన్న వాళ్ళు లేని వాళ్ళు ఏలాంటి సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఉండడంవల్ల చాలా మేలు అని అన్నారు. ఈ కార్యక్రమం లో అపార్ట్మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### తెలంగాణ బిసీ జాగృతి రాష్ట నాయకులు నెన్నల నర్సయ్య



మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 11, ప్రజాపాలన : ప్రభుత్వ ఉద్యోగలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బిసీ జాగృతి రాష్ట నాయకులు నెన్నల నర్సయ్య అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్లో సోమవారం జరిగిన తెలంగాణ బిసీ జాగృతి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం, దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉన్నప్పటికీ ఉ ద్యోగాలలో బీసీలకు రాష్ట్రంలో కేవలం 9 శాతం, కేంద్రంలో 14 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉందని అన్నారు. 1979 లో అప్పటి కేంద్ర ప్రభుత్వం బిపి మండల్ యాదవ్ పేరుతో కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని , ఆ కమిషన్ నివేదిక 1982 లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. బీసీలకు ఉద్యోగాలలో 27శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నివేదికల ఇచ్చి 39 సంవత్సరాలు అవుతున్నప్పటికీ 27శాతం రిజర్వేషన్లను కూడా ప్రభుత్వాలు అమలు చేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ బీసీ యువతతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడుతామని హెచ్చరించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కార్యదర్శి గుమ్ముల శ్రీనివాస్ ,పట్టణ కార్యదర్శి తోకల మహేష్ ,కార్యనిర్వాహక కార్యదర్శి గుమ్ముల శ్రీనివాస్ ,కాగితల సత్యనారాయణ ,యువ జాగృతి నాయకుడు మంచర్ల సదానందం , నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు ..

## మహిళలు స్వయం శక్తి తో ఎదగాలి





బాలాపూర్: అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేషన్ మేయర్ పేర్కొన్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఒకటో డివిజన్ కార్పొరేటర్ పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సహోదరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు విద్యార్థినిలకు ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ స్వింగ్ మెషిన్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు ఉచిత శిక్షణ కేంద్రాన్ని మీర్ పేట్ బడంగ్ పేట్ కార్పొరేషన్ మేయర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ..... మహిళలు, విద్యార్థినిలు స్వయం శక్తి తో ఎదిగేందుకు ఇలాంటి కోర్స్ లు ఉపయోగ పడతాయని ఆమె చెప్పారు. ఇప్పుడు ఉన్న ఆధునిక యుగంలో మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ , కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, అరుణ ప్రభాకర్, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి,సహోదరీ ఫౌండేషన్ నిర్వహకురాలు స్వర్ణలత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కూలీల కొరత అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానం



బాలాపూర్: అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: ఆధునిక యంత్ర పరికరాలతోనే సేద్యంలో లాభం ఉంటుందని,కూలీల కొరత అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలిని అందెల అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మహేశ్వరం గేట్ వద్ద



తిరుమల అగ్రిమార్ట్ నూతన షోరూమ్ ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ ప్రారంభించారు. వ్యవసాయ పనిముట్లు, ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలను పరిశీలించారు. కూలీల కొరతనుఅధిగమించేందుకు ఈ యంత్రాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని అందెల శ్రీరాములు అన్నారు. వ్యవసాయ యోగ్యమైన కందుకూరు, మహేశ్వరం మండలాలకు అందుబాటులో అగ్రిమార్ట్ నెలకొల్పటం శుభపరిణామనీ అన్నారు. ఈ సందర్భంగా తిరుమల అగ్రిమార్ట్ గ్రూపు ఛైర్మన్ కాసుల మహేందర్ ను అందెల శ్రీరాములు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా ఉపాధ్యక్షురాలు నాగ ప్రమీల, రాష్ట్ర నాయకులు కదారి జంగయ్య యాదవ్, తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సెలర్లు, ఫ్లోర్ లీడర్ ఎరుకల శివకుమార్ గౌడ్, జాపాల భావన సుధాకర్, బరిగెల రాజు గౌడ్, రాజమోనీరాజు, శివయ్య, బాకీ విలాస్, అనితా జయరాజు సహా నేదునూర్ మాజీ ఎంపీటీసీ బాలరాజు, తుమ్మలూరు ఎంపీటీసీ రాంరెడ్డి, సిరిగిరిపురం సర్పంచి సురేష్, గుమ్మడవెల్లి సర్పంచి ప్రభాకర్, ఉపసర్పంచి మహేందర్, తుక్కుగూడ జీఎస్ కృష్ణ, అమీర్ పేట శాలివాహన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, బంటు రమేష్, పాల కృష్ణ, కోటగిరి శ్రీనివాస్, బాదావత్ శ్రీనివాస్, ఆమన్గల్ మాజీ ఎంపీపీ వీరన్న, శ్రీనివాస్ యాదవ్, రఘు, రాజేందర్, ప్రశాంత్ సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## ఇంటురికి ఘనస్వాగతం పలికిన గ్రామ ప్రజలు..



పాలేరు అక్టోబర్ 11 ప్రజాపాలన ప్రతినిధి :కూసుమంచి మండలం జీళ్ళచేరువు గ్రామంలోదేవి నవరాత్రి ఉత్సవాలు భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, కి ఘనస్వాగతం పలికిన గ్రామ ప్రజలు, అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకోని అమ్మవారి విగ్రహానికి కొబ్బరికాయ కొట్టిన ఇంటూరి శేఖర్. ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ అమ్మ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మెయిన్ బజార్ లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాని ప్రారంభించిన. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్

## మంత్రి కొప్పుల ఈశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపిన టిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు: సింహాచలం జగన్



వెల్గటూర్ అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: మంత్రి కొప్పుల ఈశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్గటూర్ మండలం టి.ఆర్.ఎస్ నూతన అధ్యక్షులు సింహాచలం జగన్ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, యువత అధ్యక్షులు బిడారి తిరుపతి, బి.సి.సెల్ అధ్యక్షులు కుమ్మరి వెంకటేష్, రైతు అధ్యక్షులు మారం జగన్ మోహన్ రెడ్డి,అసంగటిత కార్మిక శాఖ అధ్యక్షులు సిగిరి ఆనంద్, విద్యార్థి విభాగం అధ్యక్షులు చొప్పదండి సంతోష్, ఉపాధ్యక్షలు సంకోజు తిరుమల చారి, యువత ప్రధాన కార్యదర్శి గొల్లపెల్లి రాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఏలేటి కృష్ణారెడ్డి, రైతు బంద్ కోర్డినేటర్ చుక్క శంకర్ రావు, సింగిల్ విండో అధ్యక్షులు గూడ రాంరెడ్డి, దుర్గం శ్రీనివాస్, గంగుల నగేష్, గుండాటి రాజేశ్వర్ రెడ్డి,మూగల సత్యం, పడిదం వెంకటేష్, మల్లేశం, కోలా చరణ్, గాదం భాస్కర్ పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి పనులపై గ్రామ సభ



కోరుట్ల, అక్టోబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల మండలంలోని జోగన్ పల్లి గ్రామంలో సోమవారం రోజున గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక జిపిడిపి గ్రామసభ గ్రామ సర్పంచ్ దుంపల నర్సు ఆధ్వర్యంలో నిర్వహి%శీ%చారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాబోయే సంవత్సరాల కాలానికి సంబంధించిన అన్ని అంశాల పైన చర్చించడం జరిగిందని, అలాగే గ్రామంలో ఏ పనులు చేయాలి అనే అంశం మీద చర్చించారని, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ , సిసి రోడ్ల నిర్మాణం, మరియు ప్రజలకు అవసరాల పనుల పైన చర్చించడం జరిగిందని గ్రామ సర్పంచ్ దుంపల నర్సు రాజా నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి,వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి హకీమ్ ,అంగన్వాడీ టీచర్స్, హెల్త్ వర్కర్స్ ,వీఆర్ఏలు నరేందర్,సంజీవ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణంలో ఘనంగా దుర్గా మాత బోనాలు



కోరుట్ల,అక్టోబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల పట్టణంలోని 22 వ వార్డ్ లో ఆదివారం రోజున దుర్గామాతకి భక్తి శ్రద్ధలతో ఘనంగా నెత్తిన బోనాలు ఎత్తి అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మడవేని నరేష్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఆతల్లి యొక్క చల్లని దీవెనలు అందరికీ లభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మదవేని నరేష్,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## గుట్రాజ్ పల్లి గ్రామంలో అభివృద్ధి పనులతో బతకమ్మ సంబరాలు జరుపుకొన్న ఎమ్మెల్యే సంజయ్, జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత



జగిత్యాల, అక్టోబర్, 11 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్ పల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, కంపోస్టు షెడ్, డిఎంఎఫ్ టి నిధులు 2.76 లక్షలతో నిర్మించిన మున్నూరు కాపు సంఘ భవనాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పి చైర్ పర్సన్ దావా వసంత ప్రారంభించి అనంతరం గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ అడినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దమ్మని విజయ లక్ష్మి , ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎఎంసి చైర్మన్ దామోదర్ రావు, సర్పంచులు ఫోరమ్ అధ్యక్షుడు జాన్, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందాం, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, గంగరాజం, మహేష్, తిరుపతి, అంజి, షేర్ల మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## స్వీయ చరిత్ర ప్రాముఖ్యత

స్వీయ చరిత్రలద్వారా సామాజిక పరిణామాలు, వ్యక్తిగత జీవితాలు రెండూ తెలుస్తాయి. ఆయా పార్టీల ఉద్యమాల చరిత్రలో సాధికారిక ఆమోదించబడిన అంశాలు మాత్రమే రికార్డవుతాయి. స్వీయ చరిత్రలద్వారా వాటితోపాటు ఇతర అభిప్రాయాలు, ఇతర కోణాలు, నిక్షిప్తం కావడంతోపాటు, వ్యక్తిత్వ వికాసం ఎలా జరిగిందో తెలుపుతాయి. తద్వారా స్వీయ చరిత్రలు వ్యక్తిత్వ వికాస గ్రంథాలుగా కూడా స్ఫూర్తినిస్తాయి.

గత వందేళ్ళుగా ఎన్నో ఉద్యమాలు చేశాము. ఉద్యమాల చరిత్ర కొంత రికార్డు అయింది కానీ, ప్రజల చరిత్ర, జీవితం, సంస్కృతి వారి జీవితాల్లో భాగంగా రికార్డు చేయలేకపోతున్నాం. తెలంగాణ సమకాలీన చరిత్ర, ఉద్యమాలు, సంస్కృతి, మలి తెలంగాణ ఉద్యమం, జీవితాల్లో భాగంగా రికార్డు చేయలేకపోతున్నాం. కథలు, నవలలు, పాటలు, సినిమాలు, ప్రదర్శనలు వేరు. జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు వేరు. ఇప్పుడు జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు రాయాల్సిన కాలం. మహారాష్ట్రలో దళిత పాంథర్స్ ఉద్యమంలో 60-70కి పైగా స్వీయ చరిత్రలు వెలువడ్డాయి. మలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు జిల్లాకు కనీసం 30 మంది రాసినా, 31 జిల్లాల నుండి వెయ్యికి పైగా అవుతాయి. అలా స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు సంక్షిప్తంగానైనా, విస్తారంగానైనా రావాల్సిన అవసరం ఉంది. అది ప్రజల చరిత్రను తెలుపుతుంది. స్వయంగా రాయలేకపోతే రాయగలిగినవారితో మాట్లాడి అన్ని వివరాలు చెప్పి రాయించడం అవసరం.

స్వీయ చరిత్రలు ఒక ప్రత్యేక ప్రక్రియ. జీవితం గురించి స్వీయ చరిత్రలు - జీవిత చరిత్రలు అని రెండు విధాలు. స్వీయ చరిత్రలు స్వయంగా రాసేవి. రాసే వారికి చెప్పి ఉత్తమ పురుషలో రాయించేవి కూడా ఉంటాయి. జీవిత చరిత్రలు ఇతరులు రాసేవి. స్వీయ చరిత్రలను నవలగా కూడా కొందరు రాస్తారు. రామాయణం రాముడి జీవిత చరిత్ర. సింధుబాద్ సాహస యాత్రలు యాత్ర చరిత్ర. ఫాహియాన్, హ్యుయన్‌త్సాంగ్, ఇట్సింగ్, రాహుల్ సాంకృత్యాయన్, ఏనుగు లక్ష్మణ్ స్వామి యాత్ర చరిత్రలు చరిత్రను తెలుపుతాయి. స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు, యాత్ర చరిత్రలు, గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథాలుగా స్ఫూర్తినిస్తాయి. మనం రికార్డు చేస్తేనే రేపటి చరిత్రకు ఆనవాల్లు దొరుకుతాయి. ఆచార్య నాగార్జునుడు, శాతవాహన రాజుకు రాసిన 'సుహృల్లేఖ' నాటి చరిత్రను, సంబంధాలను తెలుపుతుంది. మాజీ ప్రధాని పి.వి.నర్సిహరావు ఇన్‌సైడర్ (లోపలి మనిషి) అనే స్వీయ చరిత్రని, ఎడ్మెసెస్ స్మెడ్లీ స్వీయ చరిత్ర, 'భూమి పత్రిక' నవల రూపంలో రాశారు. శ్రీశ్రీ తన ఆత్మకథను చరిత్రాత్మక కథా నవల అని అన్నారు. కొందరు, రోజువారి డైరీ రాతల నుండి ముఖ్యాంశాలను ఎంపిక చేసి స్వీయ చరిత్రగా రాశారు. **(మిగతాభాగం రేపటి సంచికలో..)**

# తక్షణం తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలి: టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావ దుర్గాభవాని

మధిర అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు బాగా పెరిగిన నేపథ్యంలో టీచర్ల సర్దుబాటు చేస్తే సమస్య తీరదని, ఇందుకోసం తక్షణం తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని లితెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.హెచ్. దుర్గా భవానిలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం టీఎస్ యుటిఎఫ్ లిఖమ్మం జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ రావు అధ్యక్షతనలి మధిర డివిజన్ కార్యాలయంలో జరిగిన డివిజన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్యకు సరిపడే ఉపాధ్యాయుల ఏర్పాటు, పాఠశాలల పరిశుభ్రత అత్యంత ప్రాధాన్యమైందని ఆమె తెలిపారు .అందుకోసం తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకంతో పాటు ప్రతి పాఠశాలకు స్వచ్ఛ కార్మికులను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు బాధ్యత అప్పగించడంతో సరిపెట్టుకుంటే క్షేత్రస్థాయిలో ఆశించిన విధంగా పారిశుద్ధ్య పనులు జరగడం లేదన్నారు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసుకునేందుకు, ప్రభుత్వ విద్యను నిలబెట్టుకునేందుకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకునే విధంగా సంఘ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.



జోనల్ విధానం,లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ రాష్ట్రపతి ఆమోదం లభించినందున విద్యాశాఖ వెంటనే సర్వీస్ నిబంధనలు రూపొందించి అన్ని స్థాయిల్లో పదోన్నతులు పూర్తిచేయాలని ఆమె డిమాండ్ చేశారు. కరోనా రక్షణ చర్యలు పాటిస్తూ దసరా సెలవుల అనంతరం సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు, అన్ని రకాల గురుకులాలు, కేజీబీవీ పాఠశాలను ప్రారంభించాలని కోరారు. భౌతిక దూరం, మాస్క్ ధరించడంలాంటి కరోనా రక్షణ చర్యలతో పాఠశాలలు కళాశాలలు ప్రారంభమై కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆ సౌకర్యం లేకపోవడంతో విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లిఈ సమావేశంలో %ఖుఖఖీ% ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వి. నాగమల్లేశ్వర రావు, పారుపల్లి నాగేశ్వరావుమధిర, బోనకల్,ఎర్రుపాలెం మండలాల అధ్యక్ష కార్యదర్శులు ఏ. వినోద్ రావు, యస్.కె.నాగూర్ వలి, కె.రమేష్, జి.రామ కృష్ణ, బి.నాగరాజు, ఏ. కోటేశ్వరరావు, నాయకులు డి. భీమశంకర రావు, యస్.కె.లాల్ అహ్మద్, వీరయ్య, జె.సురేష్ ,వి.సాంబయ్య, వై.చిన్ని సీనియర్ నాయకులు మీరాఖాన్, తలుపుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన సర్వే చేపట్టాలి

ఇబ్రహీంపట్నం అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలో కుత్బుల్లాపూర్ గ్రామంలో సర్వే నెంబరు 118 లో ప్రభుత్వ భూమిని సర్వే చేసిన తర్వాత కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల నుండి బయటికి తీయడం లేదని గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని గ్రామ ప్రజలు అడ్డుకోవడం జరిగింది. రెవెన్యూ అధికారులు వచ్చి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని, గ్రామ పంచాయతీ ముందు ధర్నా చేయడం జరిగింది. రెవెన్యూ అధికారులు నాయబ్ తహసిల్దార్ విచ్చేసి కూల కొడతామని, సమాధానం చెప్పేంతవరకు ఇక్కడి నుండి లేచేది లేదని భీష్మించుకు కూర్చోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఈ. నరసింహ హాజరై మాట్లాడుతూ సర్వే చేసి హద్దులు వేసినకాడికి వెంటనే కట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు రెవెన్యూ అధికారులు గ్రామ పెద్దలు కుమ్మక్కై అంత పెద్ద నిర్మాణాలు కడుతున్న పట్టనట్టు ఉన్నారని ఆవేదన వ్యక్తం ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని లేనియెడల ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి శంకరయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## కీర్తి కుమార్ ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత

బోనకల్, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:దళిత గిరిజన బహుజన సాధికారత సంస్థ ఆధ్వర్యంలో కీర్తి కుమార్ ఉన్నత చదువులకు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం పుల్లయ్య పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి నాడు. ఈ కార్యక్రమాన్ని స్థానిక బోనకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాధిక మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ , బీజేపీ యువ నేత బీ పీ నాయక్ ,మరియు యూత్ కాంగ్రెస్ నేత భూక్యా భద్రు నాయక్ స్థానిక అధికారుల చేతుల మీదుగా కీర్తీ కుమార్ కు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ కిర్గిస్తన్ లో విద్య ను అభ్యసిస్తున్న కీర్తి కుమార్ ను అభినందించి నా వంతుగా తప్పకుండా ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీపీ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కు ఆర్థిక చేయూత ను ప్రతి ఒక్కరూ అందించాలని నా బాధ్యతగా కీర్తి కుమార్ చదువుకు సహాయం అందిస్తామని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.



## బాపునగర్ లో బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి



అమీర్ పేట్ అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ ఆడపడుచుకు అత్యంత ప్రీతి పాత్రమైన పండుగ బతుకమ్మ పండుగ అని , ఈ పండుగకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో, మంత్రి తలసాని ఆదేశాలతో అమీర్ పేట్ డివిజన్ లో ప్రతీ యేటా ఆడపడుచులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అమీర్ పేట్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తెలిపారు. ఈ సందర్భంగా బాపు నగర్ బస్తీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు బస్తీ అధ్యక్షుడు హరి సింగ్ జాదవ్,రాజు నాయక్,సీనియర్ తెరాస నేతలు అశోక్ యాదవ్,కూతురు నరసింహ, రోజా రెడ్డి,బలరాం,జితేందర్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం

### టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంమండల కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్



మధిర అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: ఆజాద్ రోడ్లో రామనాథం ఇంటిదగ్గరఅమ్మవారి ఉత్సవాలు భాగంగా భారీ అన్నదానంఅన్నం పరబ్రహ్మ స్వరూపం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం 15వ వార్డ్ కౌన్సిలర్ కోనా ధని కుమార్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పేర్కొన్నారు. సోమవారం 15వ వార్డులోని దుర్గా దేవి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించ్చాప్రారంభించ్చాఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు ప్రజలకు ఎప్పుడూ ఉండాలని దేవుని ఉండాలని కోరారుఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ కోనా సుచరిత, మునుగోటి వెంకటేశ్వరావు మల్లాది హనుమంతరావు కపిలవాయి జగన్ మోహన్ రావు బాహాటం రాజు ములకలపల్లి వినయ్

## ఆస్పత్రిలో సిమెంట్ బెంచీలు బహూకరణ



యాదాద్రి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి వలిగొండ మండల పరిధిలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో రోగులకు సేద తీరడానికి సోమవారం వైద్యాధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్ వారి తండ్రి కీ.శే.ముప్వ శ్రీరాములు మామ కీ.శే.దేవినేని భద్రయ్య జ్ఞాపకార్థం మరియు వేముల కొండకు చెందిన స్థానిక నాయకులు కేసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తన కొడుకు కేసిరెడ్డి రాజా నరసింహరెడ్డి జ్ఞాపకార్థం మొత్తం 20 వేల విలువైన సిమెంట్ బెంచీలను ఆసుపత్రికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రామయ్య,డాక్టర్ సుమన్ కళ్యాణ్,ఆరోగ్య పర్యవేక్షకులు నాశబోయిన నరసింహ,ఫార్మసిస్ట్ శ్రీనివాస్,జే. సత్తయ్య,వినోద,అనిత,వినోద్ కుమార్,చరణ్,సతీష్,బ్రహ్మచారి, శ్రీదేవి,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం మొక్కలను సంరక్షిస్తున్నందుకు కొంగర జగ్గయ్య కు సన్మానం



ఇబ్రహీంపట్నం అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో హరితహారం లో భాగంగా రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు నిత్యం పాదులు తీసి,నీరు పెడుతూ కంటికి ా ం ఎ ్ ఎ ల ా కాపాడుతున్నందుకుగాను ఆదివారం గ్రామస్తులు ఆయనను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మడుపు వెంకటేష్, నర్కుడీ నరసింహ్మా, బుట్టి మహేందర్ ముదిరాజ్, నరాల శ్రీనివాస్, బుట్టి శ్రీకాంత్, నలోల్ల శేఖర్, కొంగరి చంద్రయ్య, ఎండి జహంగీర్, మడుపు శ్రీనివాస్, బోసుపల్లి కవి, బోసుపల్లి కిషోర్, మంత్రి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలి: సిపిఎం



మధిర, అక్టోబరు 11, ప్రజాపాలన ప్రతినిధి:మున్సిపాలిటీ పరిధిలోని చిరువ్యాపారులకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందించాలని సిపిఎం పార్టీ టౌన్ కమిటీ సభ్యులు తేలప్రోలు రాధాకృష్ణ, పడకంటి మురళి డిమాండ్ చేశారు . మున్సిపాలిటీ పరిధిలో అనేక రకాల చిరువ్యాపారులు ఉన్నారని వారికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలను ఏవిధమైన హామీలు లేకుండా బ్యాంకులు ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు . మున్సిపాలిటీ పరిధిలోని చిరువ్యాపారులకు మార్కెట్ సౌకర్యం కల్పించి షాపులు నిర్మించాలని పేర్కొన్నారు .గ్యాస్ డీజిల్ పెట్రోల్ నిత్యావసర ధరలను తగ్గించాలని,ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలని ,మున్సిపాలిటీ పరిధిలో పందులను నిర్మూలించాలని , డ్రైనేజీ, రోడ్లు, వీధి లైట్లు, కాలువలను సౌకర్యాలు కల్పించిలని,తదితర డిమాండ్లతో పరిష్కరించాలని మెయిన్ రోడ్ పై నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది .ఈ కార్యక్రమంలో మల్లా చారి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వడ్రాణం మధు చిరువ్యాపారులు ఆ ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలను రద్దు చేయాలి.ఎస్ ఎఫ్ ఐ



యాదాద్రి అక్టోబర్ 11 ప్రజా పాలన ప్రతినిది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలను రద్దు చేసి చదువుతున్న కళాశాలల్లోనే అసైన్‌మెంటు రూపకంలో పరీక్షలు నిర్వహించాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల జైపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం పరీక్షలు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా సందర్భంగా వారు మాట్లాడుతూ కరోన కాలంలో ప్రమోట్ చేసి మళ్ళీ పాఠాలు వినకుండా లెక్చరర్లు లేకుండా చదువే చదవకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం తహశీల్దార్ గారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల కార్యదర్శి వేముల నాగరాజు,ఉపాధ్యక్షులు వేముల జ్యోతిబసు, మానస, మౌనిక,నరేందర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి బోనాల సందడి





మల్లాపూర్, అక్టోబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి) : మల్లాపూర్ మండల కేంద్రంలో శ్రీ కనక దుర్గమ్మ దేవి ఆలయంలో శ్రీ దేవిశరన్నవరాత్రి ఉత్సవాల భాగంగా సోమవారం మల్లాపూర్ నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపు నిర్వహించి అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారు శ్రీ స్కంద మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తోట రవీందర్, నాంపల్లి మారుతి, కైరా రాములు, లక్ష్మారెడ్డి, రాజ్ కుమార్, మ్యాకాల సతీష్, వంజరి సురేందర్, దుర్గ భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## హాలీవుడ్ సూపర్ స్టార్స్ రేంజ్ లో ప్రభాస్..!



ఇండియాలో ప్రస్తుతం బిగ్గెస్ట్ స్టార్ హీరో ఎవరు అంటే ఎక్కువ మంది చెప్పే పేరు ప్రభాస్. సినిమాలు.. వసూళ్లు.. పారితోషికం ఇతర విషయాలను పరిగణలోకి తీసుకుని ఇండియాస్ బిగ్గెస్ట్ స్టార్ గా ప్రభాస్ ను అభిమానులు ఖరారు చేయడం జరిగింది. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న మరియు కమిట్ అయిన సినిమాల విలువ మూడు కోట్లకు పైగానే అంటూ టాక్ వస్తుంది. రాధే శ్యామ్.. సలార్ మరియు ఆదిపురుష్ సినిమాలే వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్ తో రూపొందిన సమాచారం అందుతోంది. ఇక ఆ సినిమాల విలువ భారీగా ఉంది. ప్రభాస్ రాబోతయే రెండు ఏళ్లలో బాక్సాఫీస్ వద్ద మినిమంగా మూడు వేల కోట్లకు పైగా వసూళ్లు చేయడం ఖాయం అనే నమ్మకంతో ఇండస్ట్రీ వర్గాల వారు ఉన్నారు. ఇక ప్రభాస్ పారితోషికం కూడా అదే రేంజ్ లో ఉంది. ఇండియాలో ఏ బాలీవుడ్ స్టార్ కాని ఇతర స్టార్స్ కాని అందుకోలేనంత ఎత్తున ప్రభాస్ నిలిచాడు.రాబోయే రెండేళ్లలో విడుదల కాబోతున్న సినిమాలకే ప్రభాస్ దాదాపుగా 500 నుండి 550 కోట్ల రూపాయల పారితోషికంను అందుకున్నాడని.. ఆ తర్వాత రాబోతున్న సినిమాలు.. ఇటీవల కమిట్ అయిన సినిమాల పారితోషికాలు మరో అయిదు వందల కోట్ల వరకు ఉంటాయని ట్రేడ్ పండితుల అభిప్రాయం. భారీ ఎత్తున అంచనాలున్న సినిమాల్లో ప్రభాస్ నటిస్తున్న కారణంగా ఆయన పారితోషికం ఆయా సినిమాల విడుదల తర్వాత కూడా మరింత ఉంటుందని అంటున్నారు. ఈమధ్య కాలంలో ప్రభాస్ తన సినిమాకు వంద కోట్ల పారితోషికంతో పాటు లాభాల్లో వాటాను కూడా మాట్లాడుకుంటూ ఉన్నాడు. అంటే సినిమాలు మినిమంగా సక్సెస్ అయినా కూడా పాతిక నుండి యాభై కోట్ల వరకు అదనంగా ప్రభాస్ ఖాతాలో పడుతుంది.బాహుబలి మరియు సాహొలాలకు పారితోషికాల విషయంలో ఇంతగా ప్రచారం జరగలేదు. కాని ఈసారి ప్రభాస్ అందుకుంటున్న పారితోషికం హాలీవుడ్ స్టార్ హీరోల రేంజ్ లో ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. హాలీవుడ్ లో నటించే చిన్న చిన్న హీరోలు సైతం ప్రభాస్ వెనుకే ఉంటారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ లో సైతం ప్రభాస్ ముందు ముందు సినిమాలు సందడి చేయబోతున్నాయి. కనుక ప్రభాస్ పాన్ వరల్డ్ స్టార్ గా మారి మరింతగా పారితోషికాలు అందుకుంటాడనే నమ్మకంను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. రాబోయే మూడు ఏళ్లలో ప్రభాస్ నుండి రాబోతున్న సినిమాలు దేశ వ్యాప్తంగా సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రభాస్ జోరు చూస్తుంటే రాబోయే అయిదు ఏళ్లలో వెయ్యి కోట్లకు మించిన పారితోషికాలు తన ఖాతాలో వేసుకునేలా ఉన్నాడు అనిపిస్తుంది.

### ఫస్ట్ లుక్ పోస్టర్ తో 'ధర్మపురి' !




కొత్త దర్శకుడు విశ్వ జగత్ దర్శకత్వంలో, భాస్కర్ యాదవ్ దాసరి నిర్మాణంలో శేఖర్ మాస్టర్ ప్రెజెంట్స్ లో రాబోతున్న సినిమా 'ధర్మపురి'. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేసింది టీమ్. పోస్టర్ లో ప్రధాన నటినటులని రివీల్ చేస్తూ.. కథ తాలూకు నేపథ్యాన్ని కూడా ఎలివేట్ చేసన్తూ పోస్టర్ ను వదిలారు. పోస్టర్ ను చూస్తుంటే.. సినిమా యాక్షన్ లవ్ స్టోరీలా ఉంది.ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. అయితే బీడీ వర్కర్స్ కు సంబంధించిన లైఫ్ స్టైల్ ఆధారంగా ఈ చిత్రం పీరియాడిక్ నేపథ్యంలో తెరకెక్కుతుంది. కొత్త నటీనటులతో రాబోతున్న ఈ సినిమాలో హ్యూమన్ రిలేషన్స్ ను హైలైట్ చేస్తూ హద్దులు లేని ప్రేమ కథగా ఈ చిత్రాన్ని తీసుకురాబోతున్నారు. అలాగే ప్రేమలోని ఓ కొత్త కోణాన్ని కూడా ఈ చిత్రంలో ఎస్టాబ్లిష్ చేయబోతున్నారు.

## అమ్మాయిలకు అందమే కాదు ఆత్మవిశ్వాసమూ ఉండాలి: శేఖర్ కమ్ముల



సినిమా కథలలో రెండు రకాలు కనిపిస్తాయి. ఆకాశంలో తేలే కథలు కొన్నయితే . నేలపై నడిచే కథలు కొన్ని. ఆకాశంలో తేలే కథలు తొందరగా అదృశ్యమవుతాయి. నేలపై నడిచే కథలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. కళ్లముందు ఎక్కువ కాలం ఉంటాయి. అలా నేలపై నడిచే కథలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించే అతి తక్కువ మంది దర్శకులలో శేఖర్ కమ్ముల ఒకరుగా కనిపిస్తారు. ఆయన కథలు ఊహల్లో నుంచి పుట్టవు. కలల రెక్కలను తగిలించుకుని ఎగరవు. తన చుట్టూ ఉన్న జీవితాలను పరిశీలిస్తూ వాటిలో నుంచి తన కథకు కావలసిన ముడిసరుకును ఆయన తయారు చేసుకుంటారు. అందువల్లనే ఆయన కథలు మనసుకు అంత దగ్గరగా ఉంటాయి. సినిమా అనగానే కాలక్షేపానికి కాసేపు చూసేది .. అందానికి మించిన వినోదం మరేదీ అందించలేదు. ఆ కోణంలో హీరోయిన్లను చూపిస్తే సరిపోతుందనుకునే దర్శకులు లేకపోలేదు. కానీ హీరోయిన్ కి అందమే కాదు ఆత్మాభిమానం ఉంటుంది .. ఆత్మవిశ్వాసం ఉంటుంది. ఆడిపాడటమే కాదు అంతకు మించిన విలువైన వ్యక్తిత్వం ఉంటుందనే విషయాన్ని శేఖర్ కమ్ముల తన సినిమాల ద్వారా చెబుతుంటారు. ఆయన సినిమాల్లో హీరోయిన్ తన వ్యక్తిత్వం కోసం పోరాడుతుంది. తన ఉనికి చాటుకోవడానికి ఉప్పెనకు ఎదురు నిలబడుతుంది.'డాలర్ డ్రీమ్స్' నుంచి ఇటీవల విడుదలైన 'లవ్ స్టోరీ'వరకూ ఈ విషయాన్నే చాటిచెబుతాయి. ప్రేమ రెండు మనసులకు సంబంధించినది .. పెళ్లి రెండు కుటుంబాలకు సంబంధించినది. ఒకదాని కోసం ఒకటి వదులుకోకూడదు అనే బలమైన సందేశాన్ని ఆయన అంతర్లీనంగా ఇస్తూ ఉండటం వల్లనే యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ఆయన సినిమాలను ఎక్కువగా ఆదరిస్తుంటారు. ఆయన సినిమాల్లో ఆత్మవిశ్వాసంతో కూడిన నాయిక పాత్రలను ప్రేక్షకులు మరిచిపోలేరు. అంతగా అవి వాళ్లను ప్రభావితం చేస్తుంటాయి. ఆ పాత్రలను ఆయన ఎలా సృష్టించింది ఒక సందర్భంలో ప్రస్తావించారు."అమెరికా వెళ్లడమే ఒక కలగా పెట్టుకుని ఆరాటపడటం అనవసరమనే ఒక ఆలోచనలో నుంచి 'డాలర్ డ్రీమ్స్' కథ పుట్టుకొచ్చింది. ఈ కథలో నలుగురు కుర్రాళ్లు .. ఉష అనే ఒక అమ్మాయి ఫ్రెండ్స్. మన దేశాన్ని తక్కువగా చూసన్తూ విదేశాలకు విలువనిస్తూ మాట్లాడే నలుగురు కుర్రాళ్లకు ఉష పాత్ర ద్వారా కౌంటర్ ఇచ్చాను. అలాంటి ఒక పాత్రకు అమ్మాయినే ఎంచుకోవడానికి కారణం అమ్మాయిలు ఎదుర్కుంటూ వస్తున్న వివక్షనే. ఒకేసారి రెండు ఆలోచనలను రేకెత్తించడం ఇక్కడి ఉద్దేశం. ఈ పాత్ర నేను ఆశించిన స్థాయిలోనే ప్రభవితం చేసింది.ఇక 'ఆనంద్'లో రూప పాత్ర ద్వారా నేను బలవంతంగా సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం చేయలేదు. ఆ పాత్రను సహజంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో అలా ఒక్కొక్కటిగా కుదిరిపోయాయి. ఒక సాధారణమైన కుటుంబానికి చెందిన ఒక అమ్మాయి తనకి ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా నిలబడింది? అనేది రానుకుంటూ వెళ్లాను. ఆ క్రమంలోనే ఆ పాత్ర మరింత బలపడుతూ వెళ్లింది .. తన ఆత్మభిమానం కాపాడుకునే క్రమంలో ఆమె తీసుకున్న నిర్ణయాలను ప్రేక్షకులు బలపరచడం వల్లనే ఆ సినిమా అంతగా విజయాన్ని సాధించగలిగింది.'గోదావరి' గలగలలను గుర్తుచేసేలా ఈ సినిమాలో సీత పాత్రను తీర్చిదిద్దాను. ఆడపిల్లలు తమకాళ్లపై తాము నిలబడాలి .. తమని తమలానే స్వీకరించే వారిని పెళ్లి చేసుకోవాలనే ఒక ఆలోచనకు సీత పాత్ర ప్రతినిథిలా కనిపిస్తుంది. 'ఆనంద్'లోని రూప పాత్రకు .. 'గోదావరి'లోని సీత పాత్రకు మధ్య ఎంతో వైవిధ్యం ఉంది. అయినా ఈ పాత్రకు కూడా ఎంతో ఆదరణ లభించింది. అందుకు కారణం వ్యక్తిత్వంతో కూడిన ఆ పాత్రను తీర్చిదిద్దిన తీరు. ఇక 'అనామిక' విషయానికి వస్తే నిర్భయుకి నివాళిగా తీసిన సినిమా ఇది.

## ఒంటరిగానే చైతూ.. కొత్త అపార్ట్ మెంట్ లో!




అక్కినేని నాగచైతన్య – సమంత జంట విడిపోతున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇది అక్కినేని అభిమానులకు బిగ్ షాకింగ్ గా మారింది. ఇకపోతే చై–సామ్ ఇంతకుముందు గచ్చిబౌళిలోని ఓ అపార్ట్ మెంట్ లో నివశించారు. ఇప్పుడు ఆ అపార్ట్ మెంట్ లో సమంత మాత్రమే ఉంటున్నారని తెలిసింది.నాగచైతన్య మరో కొత్త అపార్ట్ మెంట్ ని కొనుక్కున్నారు. కొన్నాళ్ల పాటు తన కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా ఈ అపార్ట్ మెంట్ లోనే ఉండదలిచారట. నిజానికి అంతా సవ్యంగా సాగితే జూబ్లీహిల్స్ లో ఇప్పటికే రెనోవేషన్ లో ఉన్న తమ విలాసవంతమైన బంగ్లాలో ఉండేవారు. ఇప్పటికీ ఈ ఇంటికి మరమ్మత్తులు చేస్తున్నారట. రెడీ కావడానికి ఏడాది పడుతుందని తెలిసింది.ఇకపై ఎవరికి వారు కెరీర్ పరంగా బిజీ కానున్నారని తెలిసింది. శాకుంతలం తర్వాత సమంత తదుపరి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నారు. లవ్ స్టోరితో సక్సెస్ అందుకుని నాగచైతన్య తదుపరి కెరీర్ పై దృష్టి సారించారు. విక్రమ్ కె దర్శకత్వంలో థాంక్యూ లో నటిస్తున్నాడు. అమీర్ ఖాన్ తో లాల్ సింగ్ చద్దా.. నాగార్జునతో బంగార్రాజు చిత్రాల్లో చేస్తున్నాడు చైతన్య. ఇవన్నీ రిలీజ్ కి రావాల్సి ఉంది.

## లవ్ స్టోరీ' స్ట్రీమింగ్ అలర్ట్



ఈమధ్య కాలంలో థియేటర్లలో విడుదల అయిన సినిమాలు ఎప్పుడెప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతాయా అంటూ ఓటీటీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. థియేటర్లలో విడుదల అయిన సినిమాలు మంచి విజయం సాధించిన నేపథ్యంలో వాటికి ఓటీటీ లో మంచి డిమాండ్ ఉంటుంది. కరోనా కారణంగా థియేటర్లకు వెళ్లని వారు ఓటీటీ లో కాస్త ఆలస్యంగా అయినా సినిమాలను చూడాలని ఎదురు చూస్తున్నారు. తాజాగా విడుదల అయిన లవ్ స్టోరీ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. థియేటర్లలో సెకండ్ వేవ్ తర్వాత అతి పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్న సినిమాగా కూడా నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా యూఎస్ లో కూడా ఈ సినిమా మంచి వసూళ్లు నమోదు చేసింది. అయినా కూడా ఇంకా చాలా మంది ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ఎదురు చూస్తున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ అంతా కూడా లవ్ స్టోరీ సినిమా స్ట్రీమింగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో అఫిషియల్ అనౌన్స్ మెంట్ వచ్చింది.లవ్ స్టోరీని ఆహా లో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా అధికారిక ప్రకటన వచ్చింది. సెప్టెంబర్ 24న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ను నాలుగు వారాల తర్వాత ఆహా లో స్ట్రీమింగ్ కు ఉంచబోతున్నారు. అంటే అక్టోబర్ 22న ఈ సినిమాను ఆహాలో స్ట్రీమింగ్ చేసన్తున్నట్లుగా చెబుతున్నారు. దసరా తర్వాత ఆహా లో రాబోతున్న సినిమాలు వెబ్ సిరీస్ ల గురించి ఆహా వారు ప్రకటించారు. దసరా నుండి సంక్రాంతి వరకు తమ ఆహా లో అద్భుతమైన కంటెంట్ రాబోతున్నట్లుగా ప్రకటించిన టీమ్ ఆహా లవ్ స్టోరీ సినిమాను దసరా తర్వాత విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అయిన లవ్ స్టోరీ సినిమాను ప్రేక్షకులు థియేటర్ల ద్వారా ఆధరించారు. అలాగే ఓటీటీ లో కూడా సక్సెస్ చేస్తారనే నమ్మకం అందరిలో వ్యక్తం అవుతోంది.నాగ చైతన్య మరియు సాయి పల్లవి జంటగా నటించిన ఈ సినిమా కు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించాడు. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ సినిమా కరోనా వల్ల చాలా ఆలస్యం అయ్యింది. సాదారణంగా సినిమాలు ఆలస్యం అయితే జనాల్లో ఆసక్తి తగ్గుతుంది. కాని శేఖర్ కమ్ముల మరియు సాయి పల్లవిల కాంబోలో ఫిదా తర్వాత వచ్చిన సినిమా అవ్వడం వల్ల అంచనాలు పెరుగుతూనే వచ్చాయి. సాయి పల్లవి మరియు నాగ చైతన్యల నటన మరియు వారి మధ్య లవ్ సీన్స్ కు అంతా కూడా ఫిదా అయ్యారు.

శేఖర్ కమ్ముల ఇలాంటి ఒక మంచి మెసేజ్ మూవీ తీస్తాడని ఊహించలేదు అంటూ పలువురు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. చైతూ కెరీర్ బెస్ట్ నటనతో సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. సాయి పల్లవి డాన్స్ తో మళ్లీ ఆకట్టుకుంది. మ్యూజికల్ గా కూడా సక్సెస్ ను దక్కించుకున్న లవ్ స్టోరీ మళ్లీ ఓటీటీ లో సక్సెస్ అయ్యేనో చూడాలి.సినిమా తాజాగా విడుదల అయిన తర్వాత థియేటర్లలో హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. చాలా నెలల తర్వాత థియేటర్ల వద్ద ఆ బోర్డులను చూసిన ఇండస్ట్రీ వర్గాల వారు ఆనందం వ్యక్తం చేశారు. చాలా మంది లవ్ స్టోరీ సినిమాకు మద్దతుగా నిలిచి ప్రేక్షకులు థియేటర్లకు వచ్చేలా ప్రమోట్ చేశారు. లవ్ స్టోరీ ఒక మంచి మెసేజ్ తో కూడా వచ్చింది. కనుక ఫ్యామిలీ ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యింది. లవ్ స్టోరీ సినిమా ఓటీటీ లో స్ట్రీమింగ్ అయితే ఖచ్చితంగా మంచి వ్యూస్ వస్తాయని.. ఆహా లో ఒక మంచి సినిమాగా కూడా నిలుస్తుందనే అభిప్రాయంతో ఉన్నారు.



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989